Visakha Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

WANTED
Office Assistant-1
Jr. Accountant-1
For an Audit Firm
at Seethammadhara
Call : 95334 94102

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 127 విశాఖపట్నం, 25 ఫిబ్రవరి 2024 ఆదివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## పి.ఎం. సభా ప్రాంగణాన్ని పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** దేశ ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ నగరానికి విచ్చేస్తున్న సందర్భంగా సభా వేదిక ఏర్పాటులను త్వరతిగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మూడవ జోన్ ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్లో ప్రధాన మంత్రి సభా ప్రాంగణాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, విశాఖ జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ వి.ఎన్.పకీరప్ప, హెచ్.పి.సి.ఎల్ సిజిఎం కిరణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆంధ్ర యూనివర్సిటీలో ప్రధానమంత్రి రాక సందర్భంగా సభా ప్రాంగణం సమీపంలోనున్న హెలీపాడ్, సభా ప్రాంగణం, వేదిక నిర్మాణం తదితర ప్రాంతాలను పరిశీలించారు. గ్రౌండ్‌లో గుంతలు లేకుండా చదును చేయించాలని, గ్యాలరీ ప్రధాని వేదిక, పార్కింగ్, మరుగుదొడ్లు, తాగునీరు, పారిశుధ్యం సంబంధిత సూచిక బోర్డులు, రూట్ మ్యాప్, ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు తదితర అంశాలపై ఒక ప్రణాళికను సిద్ధం చేయాలని ఆయా సంబంధిత అధికారులను ఆదేశించారు.

అనంతరం విశాఖ జాయింట్ పోలీస్ కమిషనర్‌తో సభా వేదిక వద్ద భద్రతా ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.

హెచ్.పి.సి.ఎల్‌కు సంబంధించిన కార్యక్రమం వివరాలను హెచ్.పి.సి.ఎల్ సి.జి.ఎంను అడిగి తెలుసుకున్నారు.

ఈ పర్యటనలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, సిటీ ప్లానర్ దొర, కార్యనిర్వాహక ఇంజనీరు రత్నాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పొత్తు ఖరారైన రోజే వైకాపా కాడి వదిలేసింది: చంద్రబాబు



అమరావతి: రాష్ట్ర భవిష్యత్ కోసం జనసేనతో పొత్తు పెట్టుకున్నామని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవడం కోసం, భావితరాల భవిష్యత్ కోసమే ఈ నిర్ణయమని చెప్పారు. తమ పొత్తు కుదిరిన రోజే వైకాపా కాడి వదిలేసిందన్నారు. భాజపా కలిసొస్తే తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ మేరకు తెదేపా-జనసేన ఉమ్మడి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అసెంబ్లీకి తెదేపా తరఫున పోటీ చేసే 94 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించారు.

"రాష్ట్ర భవిష్యత్ కోసమే జనసేనతో ఈ కలయిక. ఐదు కోట్ల ప్రజల కోసం రెండు పార్టీలు కలిసి పనిచేయాలని నిర్ణయానికొచ్చాం. రాష్ట్ర చరిత్రలో ఇదో మరిచిపోలేని రోజు. రాష్ట్ర విభజన తర్వాత కంటే వైకాపా పాలనలోనే ఎక్కువ నష్టం జరిగింది. బ్రాండ్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్‌ను పూర్తిగా నాశనం చేశారు. జగన్ పాలనలో సామాన్యులు, నేతలు సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పవన్ కల్యాణ్‌ను వైజాగ్‌లో ర్యాలీ చేస్తే అడ్డుకున్నారు. పొత్తు కుదిరిన రోజే మా విజయం ఖరారైంది. ఆ రోజే వైకాపా కాడి వదిలేసింది" అని చంద్రబాబు అన్నారు.

"నా రాజకీయ జీవితంలో అభ్యర్థుల జాబితా కోసం ఎప్పుడూ ఇంత కసరత్తు చేయలేదు. అభ్యర్థుల ఎంపిక కోసం వివిధ రూపాల్లో కోటి మంది అభిప్రాయం తీసుకున్నాం. ప్రజల మధ్యన ఉండే, ప్రజలు కోరుకున్న వారిని అభ్యర్థులుగా నిలబెడుతున్నాం. తొలి విడతలో భాగంగా మొత్తం 118 మంది అభ్యర్థులను ఎంపిక చేశాం. యువత, మహిళలు, బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం. తెదేపా నుంచి పోటీ చేస్తున్న 94

(మిగతా 2లో)

## ఏపీలో ఉద్యోగుల సెలవులపై ఆంక్షలు




ఏపీలో ప్రభుత్వ ఉద్యోగుల సెలవులపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఓవైపు సార్వత్రిక ఎన్నికలు, మరోవైపు సంక్షేమ పథకాల్ని లబ్ధిదారులకు ఖచ్చితంగా అందించాల్సి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకుంది.

ఐదేళ్ల పాలన ఓ ఎత్తు, ఎన్నికల సమయం ఓ ఎత్తుగా మారిపోతున్న పరిస్థితుల్లో ఎక్కడ తేడా వచ్చినా ఇబ్బందులు తప్పవు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగుల సెలవుల విషయంలో ఆంక్షలు విధిస్తోంది.

రాష్ట్రంలో ఇప్పటికే ఎన్నికల వాతావరణం వచ్చేసింది. మరో 20 రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ కూడా రావడం ఖాయం. ఈ దశలో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం భారీ ఎత్తున అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పక్కాగా పంపిణీ జరగాలంటే అధికారులు, ఇతర సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాల్సి ఉంటుంది. లేకపోతే ప్రభుత్వానికి ఎన్నికల వేళ చెడ్డపేరు తప్పదు. అసలే విపక్షాలు ఏ చిన్న అవకాశం దొరుకుతుందా అని ఎదురుచూస్తున్నాయి. ఈ సమయంలో ఉద్యోగులు సాధారణ పరిస్థితుల తరహాలో సెలవులు పెడితే ఇబ్బందులు తప్పవని ప్రభుత్వం భావిస్తోంది.

దీంతో ఉద్యోగుల

(మిగతా 2లో)

## అధ్యాపకులు నిరంతరం నూతన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అధ్యాపకులు నిరంతరం నూతన జ్ఞానాన్ని అందిపుచ్చుకునే ప్రయత్నం చేయాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఏయూలోని యూజీసీ మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్‌లో విపత్తు నిర్వహణపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ విభిన్న రంగాల నిపుణులతో అందించే ఇటువంటి శిక్షణ

(మిగతా 2లో)

## ఏపీ, తెలంగాణాలలో రెండురోజుల పాటు వర్షాలు



ఈ సారి ఎండాకాలం ప్రారంభం కాక ముందే ఎండలు మండిపడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎండలతో విలవిలలాడుతున్నారు. ఇక ముందు ముందు ఎండాకాలాన్ని తలుచుకుంటేనే భయపడుతున్నారు.

అయితే తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ ఒక చల్లని కబురు చెప్పింది. ఏపీలో రెండు రోజుల పాటు అక్కడక్కడా తేలికపాటి నుంచి, ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

ఉత్తర చత్తీసగఢ్ పై ఉపరితల ఆవర్తనం ఇప్పుడు దక్షిణ ఛత్తీస్గఢ్ మరియు ఆ పరిసరాల్లో సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉందని ఏపీ వాతావరణ శాఖ పేర్కొంది. అంతేకాదు దక్షిణ తెలంగాణ మరియు ఆ పరిసరాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

ఒక ద్రోణి ఇప్పుడు దక్షిణ తెలంగాణ మరియు పరిసర ప్రాంతాల మీదుగా ఉపరితల ఆవర్తనం నుండి దక్షిణ తమిళనాడు వరకు రాయలసీమ మీదుగా సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతుందని, దీని ఫలితంగా వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ క్రమంలోనే వాతావరణశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమలోని పలు జిల్లాలలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని చెబుతున్నారు.

అంతేకాదు

(మిగతా 2లో)

## విమ్స్‌లో అందుబాటులోకి క్యాన్సర్, బ్రెయిన్ స్ట్రోక్ సేవలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అత్యాధునిక వైద్య సేవలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్న విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ నందు మరో మూడు అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న క్యాన్సర్ వైద్యానికి సంబంధించిన సేవలను, మానసిక ఒత్తిడికి లోనవటం ద్వారా వచ్చే బ్రెయిన్ స్ట్రోక్ వైద్యానికి సంబంధించిన సేవలు విమ్స్ ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు శనివారం మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, న్యూరాలజీ విభాగాలను విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోవిడ్ అనంతరం గడిచిన మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విమ్స్ ఆస్పత్రి అభివృద్ధి శరవేగంగా కొనసాగుతుందన్నారు. విమ్స్ ఆస్పత్రికి అవసరమైన వైద్యులు ఇతర సిబ్బందులు నియామకం విషయంలో ప్రభుత్వం చాలా చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందన్నారు. ఎన్నో ఏళ్లుగా సరైన జీతాలు లేక భర్తీ కానీ వైద్యుల పోస్టులను కూడా రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. దీనితో నూతనంగా క్యాన్సర్, తలకు సంబంధించిన విభాగాలను ప్రారంభించడం జరిగిందన్నారు. కోవిడ్ అనం తరం 70, 80 ఉన్న ఇన్ పేషెంట్ సంఖ్యను క్రమంగా 200 మంది ఇన్ పేషెంట్లు ఉంటున్నారని ఇందుకు వైద్యులు ఇతర సిబ్బంది అందించిన సేవలే కారణమన్నారు.

**క్యాన్సర్ సేవలు**

క్యాన్సర్ రోగులకు వైద్య సేవలు అందించేందుకుగాను సర్జికల్ ఆంకాలజీ ఇద్దరు వైద్యులను, మెడికల్ ఆంకాలజీ మరో ఇద్దరు వైద్యులను ప్రభుత్వం నియమించటం జరిగిందన్నారు. మెడికల్ ఆంకాలజీ ద్వారా కీమోథెరపీ రోగులకు అందించడం జరుగుతుందన్నారు. అలాగే గర్భాశయ క్యాన్సర్, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, క్యాన్సర్ కాయలను సర్జికల్ ఆంకాలజీ వైద్యులు సర్జరీల ద్వారా తొలగించు నున్నట్లు

(మిగతా 2లో)



# 3వ తేదీన పల్స్ పోలియో విజయవంతం చేయాలి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): మార్చి 3వ తేదీ ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టరు అధికారులను ఆదేశించారు. శనివారం ఈ విషయమై నిర్వహించిన వెబ్-ఎక్స్ లో ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో జిల్లాలో వున్న 0 నుండి 5 సం.ల వయస్సు గల బాలలందరికీ పోలియో చుక్కలను వేయాలన్నారు. ముఖ్యంగా కొత్తగా నిర్మించే కాలనీలలో పనిచేసేవారి పిల్లలు, పట్టణాల, గ్రామాల శివారు ప్రాంతాలలో ఉంటున్న కుటుంబాలు, సంచార జాతులు మొదలైన వారి పిల్లలపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లా పంచాయితీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు మౌలిక వసతులు కల్పించాలన్నారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు వైద్యశాఖకు సహాయపడాలని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏ.హేమంత్ మాట్లాడుతూ జిల్లాలో 1409 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. వాటిలో113 బూత్‌లు, గ్రామీణ ప్రాంతంలో 1296 బూత్లు వుండగా 35 ట్రాన్సిట్ బూత్ లు, 54 వమొబైల్ బూత్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2004 ఇంటింటి సర్వే బృందాలును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 13వ తేదీన పల్స్ పోలియో జరిగిన తరువాత 14వ తేదీన పిల్లలందరికీ చుక్కలు వేసిందీ లేనిదీ సర్వే చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపివో ఆర్.శిరీషా రాణి, డిఆర్డఏ పి.డి. శచీదేవి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పి.డి. బి.అనంతలక్ష్మి, డిసిహెచ్ ఎస్ డాక్టర్ శ్రీనివాస్, జివియంసి జోనల్ కమిషనర్ , నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపల్ కమిషనర్లు ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

## (మొదటి పేజీ తరువాయిలు)

### పొత్తు ఖరారైన రోజే వైకాపా కాడి వదిలేసింది: చంద్రబాబు

మందిలో 23 మంది తొలిసారి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. ఇందులో ఉన్నత చదువులు చదువుకున్న వారూ ఉన్నారు. అదే వైకాపా అభ్యర్థులను చూస్తే ఎర్ర చందనం స్మగ్లర్లను వారు పోటీకి పెట్టారు. మేం మాత్రం ప్రజలకు జవాబుదారీతనంగా ఉండే అభ్యర్థులనే ఎంపిక చేశాం. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలి. ఇరు పార్టీల మధ్య ఓటు బదిలీ జరగాలి. కాబట్టి పార్టీ కార్యకర్తలు ఇరు పార్టీల గెలుపునకు కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు.

గెలిచే సామర్థ్యం ఉన్న అభ్యర్థులనే బరిలో నిలుపుతున్నామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఎక్కువ సీట్లు తీసుకుని ప్రయోగాలు చేసే బదులు, తక్కువ స్థానాలు తీసుకుని రాష్ట్ర భవిష్యత్ కోసం ముందుకెళ్లాలని నిర్ణయించామన్నారు. 98 శాతం స్ట్రైక్ రేటు ఉండేలా అభ్యర్థులను ఎంపిక చేశామని చెప్పారు. ఈ అరాచక పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు ముక్తి కల్పించాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. 60, 70 స్థానాలు కావాలని కొందరు అంటున్నారని, గత ఎన్నికల్లో 10 స్థానాలు గెలిచి ఉంటే ఎక్కువ స్థానాలు అడిగేందుకు అవకాశం ఉండేదని చెప్పారు. 24 అసెంబ్లీ స్థానాలు, 3 పార్లమెంట్ స్థానాల్లో జనసేన పోటీ చేస్తుందన్నారు. భాజపాతో కలిసి ముందుకెళ్లాలన్న ఉద్దేశంతో కొన్ని స్థానాలను త్యాగం చేసినట్లు పేర్కొన్నారు. పొత్తులో భాగంగా త్యాగాలకు పాల్పడిన వారికి తెదేపా-జనసేన ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక తగిన గుర్తింపు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి పొరపొచ్చాలు వచ్చినా అవన్నీ దాటుకుని తెదేపా- జనసేన గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### ఏపీలో ఉద్యోగుల సెలవులపై ఆంక్షలు

సెలవుల విషయంలో విచక్షణతో వ్యవహరించాలంటూ సాధారణ పరిపాలనా శాఖ కార్యదర్శి రేవు ముత్యాల రాజు అన్ని ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు వచ్చేసింది. అన్ని శాఖల అధికారులు, విభాగాధిపతులకు ఇప్పటికే నిర్దేశించిన లక్ష్యాలు ఉన్నాయి. వీటిని అందుకోవాలంటే కచ్చితంగా పూర్తిస్థాయిలో పనిచేయాల్సి ఉంటుంది. అలాగే మార్చి నెలలో ప్రభుత్వం తరపున పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లతో పాటు విద్యా దీవెన, రైతు భరోసా, ఇన్ పుట్ సబ్సిడీ, వైఎస్సార్ చేయూత వంటి పథకాలు అమలు కావాల్సి ఉంది.

ఈ నేపథ్యంలో సెలవుల విషయంలో ఆచితూచి వ్యవహరించాలంటూ విభాగాధిపతులకు ఆదేశాలు పంపారు. ముఖ్యంగా ఉద్యోగుల సెలవుల ప్రభావం ప్రభుత్వ శాఖల పనితీరుపై పడకుండా చూసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది. ఏ పనీ ఆగకుండా తగినంత మంది సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశాలు వెళ్లాయి.

### అధ్యాపకులు నిరంతరం నూతన జ్ఞానాన్ని పెంపొందిచుకోవాలి

కార్యక్రమాలు అధ్యాపకులు నైపుణ్యాలను, సామర్థ్యాలను మరింత పెంపొందిస్తాయన్నారు. ఏయూలోని ఎంఎంటిటిసి కేంద్రం ఇటువంటి శిక్షణ తరగతుల నిర్వహణలో జాతీయ స్థాయిలో గుర్తింపును సాధించిందన్నారు. ఇక్కడ నేర్చుకున్న నూతన జ్ఞానాన్ని అధ్యాపకులు విద్యార్థులకు చేరువ చేయాలని సూచించారు. తద్వారా వారు ఆ జ్ఞానాన్ని నిత్య జీవితంలో ఉపయుక్తంగా నిలుపుకునే దిశగా వారిని సమాయత్తం చేయాల్సిన అవసరాన్ని వివరించారు.

కేంద్రం సంచాలకులు ఆచార్య టి.వి.కృష్ణ మాట్లాడుతూ ఏపి, తెలంగాణ రాష్ట్రాల నుంచి వివిధ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు రెండు వారాల శిక్షణ తరగతులను నిర్వహించామన్నారు. ఎర్త్‌సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, సోషల్ సైన్స్ రంగాలలో నిష్ణాతులైన వారితో శిక్షణ అందించామన్నారు.

కోర్సు సమన్వయకర్త ఆచార్య సి.వి. నాయుడు మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ తదితర అంశాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించామన్నారు. రెండు వారాల పునశ్చరణ తగతులు ఎంతో ఉపయుక్తంగా నిలచాయన్నారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న అధ్యాపకులకు సర్టిఫికేట్లను ప్రధానం చేశారు.

### ఏపీ, తెలంగాణాలలో రెండురోజుల పాటు వర్షాలు

మరికొన్ని జిల్లాలలో వర్ష ప్రభావం కొనసాగుతుందని, అయితే ఇదే సమయంలో ఎండలు కూడా తీవ్రంగా ఉండే అవకాశం ఉందని ఏపీ వాతావరణ శాఖ వెల్లడించింది. ఏపీ వాతావరణ శాఖ ప్రకటించిన వివరాల ప్రకారం ఇటు తెలంగాణ రాష్ట్రంలో కూడా రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రెండు రోజులపాటు తెలంగాణ రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

ఇటు తెలంగాణ రాష్ట్రంపై ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలోనూ రాత్రిపూట ఉష్ణోగ్రతలు పెరిగాయి. భానుడి భగభగలు మొదలయ్యాయి.

### విమ్స్‌లో అందుబాటులోకి క్యాన్సర్, బ్రెయిన్ స్ట్రోక్ సేవలు

పేర్కొన్నారు.

**బ్రెయిన్ స్ట్రోక్ వైద్యం**

అధిక ఒత్తిడి కారణంగా వచ్చే బ్రెయిన్ స్ట్రోక్ నుంచి రోగులకు వేగంగా కోలుకునేందుకు వేల రూపాయలు విలువ చేసే ఇంజక్షన్లను అందించేందుకు న్యూరాలజీ వైద్యులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికే న్యూరో సర్జరీ సేవలు విజయవంతంగా రోగులకు పూర్తిస్థాయిలో అందించడం జరుగుతుందని గుర్తు చేశారు.

**బ్రెయిన్ స్ట్రోక్ యూనిట్ ద్వారా రూ.50 వేల విలువ చేసే ఇంజక్షన్ ఉచితం**

బ్రెయిన్ స్ట్రోక్ యూనిట్ను ప్రత్యేకంగా విమ్స్ ఆస్పత్రి నందు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ యూనిట్ ద్వారా హార్ట్ ఎటాక్, బ్రెయిన్ స్ట్రోక్ సమయంలో అత్యవసరంగా అందించే రూ.50 వేలు విలువ చేసే టేనెక్టెప్లేసే (Tenecteplase) ఇంజక్షన్‌ను ఉచితంగా అందించటం జరుగుతుందన్నారు. స్ట్రోక్ గాని, హార్ట్ ఎటాక్ గాని వచ్చిన వారు 3 నుంచి 4 గంటల వ్యవధిలో ఈ ఇంజక్షన్ గాని రోగు కు అందిస్తే లేచి నడుచుకుంటూ తిరుగుతారన్నారు. స్ట్రోక్ వచ్చిన వారు గంటల వ్యవధిలో ఆసుపత్రి చేరుకుంటే ఉచితంగా ఇంజక్షన్ ఇవ్వబడుతుందని తెలిపారు.

**అతి త్వరలో మరిన్ని విభాగాలు**

అతి త్వరలో విమ్స్ ఆసుపత్రి నందు మరిన్ని విభాగాలు అందుబాటులోకి రానున్నాయని డైరెక్టర్ తెలిపారు. అడ్వాన్సుడ్ ఎక్విప్మెంట్ ద్వారా గ్యాస్ట్రోఎంటరాలజీ సంబంధించిన సేవలు, ఒబిసిటీకి సంబంధించిన సేవలు, బర్న్ వార్డును అందుబాటులోకి తీసుకొని రానున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయని త్వరలో వీటిని పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకొని రానున్నట్లు తెలిపారు.

**పంచాంగం**

ఆదివారం 25-02-2024
శోభకృత్ నామ సంవత్సరము
ఉత్తరాయణం ,శిశిర ఋతువు
మాఘ మాసం

| | |
|---|---|
| తిథి | : బ. పాడ్యమి రా. 07.06 |
| నక్షత్రం | : పుబ్బ రా. 12.17 |
| వర్జ్యం | : రా. 06.32 ల 08.18 |

# ఎన్ఎస్ఎన్ రెడ్డి 94వ జయంతి

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): శనివారం స్వర్గీయ NSN రెడ్డి 94వ జయంతి సందర్భంగా పలువురు ప్రముఖులు హాజరై రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆ మహానేత యొక్క కృషి, సిద్ధాంత పరమైన జీవితాన్ని స్మరించుకున్నారు. నేటి కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర SVS ప్రకాష్ రెడ్డి, BJP సీనియర్ నాయకులు సిరపు అప్పల రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎం.సాయి కుమార్, స్వర్ణలత, బుల్లయ్య కళాశాల, మాజీ ప్రిన్సిపాల్ ఎన్. చంద్రకాంత్ రెడ్డి, టి. సుబ్బరామి రెడ్డి, బిజెపి మాజీ నగర అధ్యక్షుడు వేమన సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు NV రమణా రెడ్డి, YSRCP నగర ప్రధాన కార్యదర్శిబీ డి. రామకృష్ణా రెడ్డి, పులగం సూర్యనారాయణ రెడ్డి, సత్తి రెడ్డి, దుంప అప్పల రాజు రెడ్డి, కొప్పాల రామ్ కుమార్, బిజెపి నగర ఉపాధ్యక్షుడుబీ అత్తిలి శంకర్ రావు, కారాల మహేష్, దక్షిణ నియోజకవర్గ కో-కన్వీనర్ M. శాలివాహన్ నగర కార్యదర్శి, నమ్మి గంగాధర్ యాదవ్, సర్వసిద్ధి వెంకటేశ్వర్లు, DDVSN స్వామి, సూరాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

### సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ , సర్వేలెన్సు టీములకు శిక్షణా కార్యక్రమం

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): సార్వత్రిక ఎన్నికలు 2024 ఏర్పాట్లలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ మరియు సర్వేలెన్సు టీములకు శిక్షణా కార్యక్రమం శనివారం కలెక్టర్ ఆఫీసు నందు నిర్వహించడం జరిగినది.

జనరల్ ఎలక్షన్స్ 2024 ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లాలో ఉన్నటువంటి హెడ్ కానిస్టేబుల్స్ మరియు ఏఎస్ఐలు మరియు డిప్యూటీ తాసిల్దారులకు, ఫ్లయింగ్ స్క్వాడ్ మరియు సర్వేలెన్సు టీములకు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, డి పి ఆర్ సి నాగలక్ష్మి మరియు డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ గోవిందరావు, పిడి డ్వామా సందీప్ ఆధ్వర్యములో ట్రైనింగ్ ప్రోగ్రాంలో కండక్ట్ చేయడం జరిగింది ఈ శిక్షణా కార్యక్రమములో ఎస్ బి 2 సిఐ అప్పల నాయుడు, ఎలక్షన్ సెల్ సిఐ కుమారస్వామి మరియు ఎలక్షన్స్ ఎస్ఐ పాల్గొనడం జరిగింది.


శ్వాసకోశ వ్యాధులకు ఉపశమనం

40 సంవత్సరాలు పైబడిన ప్రతీ ఒక్కరికి రక్తాన్ని సక్రమంగా ప్రసరించేలా చూసుకునే అవసరం ఉంది.

మీ రక్తం నిర్ణీత వేగంతో శరీరంలోని ప్రతీ భాగానికి అందేలా చూసుకోవాలంటే మీకు వివిధ వన మూలికలతో కూడిన ప్రత్యేక ఔషధం సేవించవలసిన అవసరం ఉంది.

కార్డోరియం ప్లస్




కావల్సిన వారు సంప్రదించండి:

9393949347

మన రక్త ప్రసరణను సమతుల్యం చేయడమే కాకుండా గుండెలోని రక్త నాళములు, మెదడు యందలి రక్త నాళములు మరియు శ్వాసకోశముల యందలి నాడులను ధృఢంగా చేస్తుంది. వీటిలో ఉండే అడ్డంకులను త్వరితంగా అరగదీస్తుంది. ఫలితంగా మీరు గుండెపోటు, పక్షవాతం, ఉబ్బసం వంటి వ్యాధులు రాకుండా నివారించుకోగలుగుతారు. ఇప్పటికే బాధపడుతుంటే సంపూర్ణంగా జయించగలుగుతారు.

అన్ని గ్రామాలలోను, పట్టణాలలోను ప్రైవేట్ ప్రాక్టీస్ నిర్వహించే ఆర్ఎంపీ, పీఎంపీ, డీఏఎంపీ, బీఏఎంఎస్, హోమియో, నేచురోపతి, ఆల్టర్నేటివ్ మెడిసిన్, బీపీటీ అర్హతలు కలిగిన వైద్యులు, సాంప్రదాయ మూలికావైద్యం చేయువారు డీలర్‌షిప్ కొరకు సంప్రదించండి. స్వయం ఉపాధి పథకం కింద అలకనందా ఉత్పత్తులు విక్రయించగోరువారు కూడా సంప్రదించండి.

90 రోజుల కోర్సు కేవలం రూ. 2700/- మాత్రమే.
మీరు వాడండి- మిగిలిన వారిచే కూడా వాడించండి.
అందరూ ఆరోగ్యంగా ఉండండి.



జనహిత ట్రస్ట్(రి)
9-3-16, పిఠాపురం కోలని,
విశాఖపట్నం- 530003
ఫోన్: 8247526179

Compli

# విశాఖ సమాచారమ్

ఆదివారం 25-02-2024


## పౌరుడికీ రాజకీయనాయకుడికి తేడా ఏంటి?

ఒకరోజు ఒక పూల వ్యాపారి క్షౌరం కోసం క్షౌరశాల వద్దకు వెళ్లాడు.

కట్ తర్వాత, అతను తన బిల్లు గురించి అడిగాడు.

బార్బర్ ఇలా సమాధానమిచ్చాడు, 'నేను మీ నుండి డబ్బు తీసుకోలేను, నేను ఈ వారం సమాజ సేవ చేస్తున్నాను'.

పూల వ్యాపారి సంతోషించి దుకాణం నుండి వెళ్లిపోయాడు.

మరుసటి రోజు ఉదయం మంగలి తన దుకాణాన్ని తెరవడానికి వెళ్లినప్పుడు, అతని కోసం ఒక 'ధన్యవాదాలు' కార్డు మరియు డజను గులాబీలు అతని కోసం వేచి ఉన్నాయి.

తరువాత, ఒక కిరాణా వ్యాపారి హెయిర్‌కట్ కోసం వచ్చాడు మరియు అతను తన బిల్లు చెల్లించడానికి ప్రయత్నించినప్పుడు, క్షౌరకుడు మళ్లీ ఇలా సమాధానమిచ్చాడు, 'నేను మీ నుండి డబ్బు తీసుకోలేను, నేను ఈ వారం సమాజ సేవ చేస్తున్నాను.

కిరాణా వ్యాపారి సంతోషించి దుకాణం నుండి వెళ్లిపోయాడు.

మరుసటి రోజు ఉదయం బార్బర్ తెరవడానికి వెళ్ళినప్పుడు, అతని కోసం ఒక 'ధన్యవాదాలు' కార్డు మరియు తాజా కూరగాయల సంచి అతని కోసం వేచి ఉంది.

అప్పుడు ఒక రాజకీయ నాయకుడు జుట్టు కత్తిరింపు కోసం వచ్చాడు, అతను తన బిల్లు చెల్లించడానికి వెళ్ళినప్పుడు, క్షౌరకుడు మళ్లీ ఇలా సమాధానమిచ్చాడు, 'నేను మీ నుండి డబ్బు తీసుకోలేను. నేను ఈ వారం సమాజ సేవ చేస్తున్నాను.

రాజకీయ నాయకుడు చాలా సంతోషించి దుకాణం నుండి వెళ్లిపోయాడు.

మరుసటి రోజు ఉదయం, బార్బర్ తెరవడానికి వెళ్ళినప్పుడు, ఒక డజను మంది రాజకీయ నాయకులు ఉచిత హెయిర్‌కట్ కోసం వేచి ఉన్నారు.

ఇది, మన దేశ పౌరులకు మరియు సమాజాన్ని నడిపే రాజకీయ నాయకులకు మధ్య ఉన్న ప్రాథమిక వ్యత్యాసాన్ని వివరిస్తుంది.

## సిద్దార్థ రాయ్ సినిమా సక్సెస్ మీట్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శ్రీ రాదా దామోదర స్టూడియో బ్యానర్లో విహన్ & విహిన్ క్రియేషన్స్ యంగ్ హీరో దీపక్ సరోజ్ హీరోగా తన్వి నెగి హీరోయిన్ గా ఏశస్వి దర్శకత్వంలో సిద్దార్థ్ రాయ్ చిత్రం విడుదల సందర్భంగా చిత్ర యూనిట్ బీచ్ రోడ్ లో గల ఒక రెస్టారెంట్‌లో శనీవారం సక్సెస్ మీట్‌లో భాగంగా మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో నిర్మాత ఫణి మాట్లాడుతూ చిన్న సినిమాగా విడుదల అయ్యింది. తొలి రోజే హిట్ టాక్‌తో పెద్ద విజయం సాధించింది. మీడియా ద్వారా మంచి ప్రమోషన్ చేశారు అని ధన్యవాదాలు తెలిపారు. దర్శకుడు కథ, కథనం దర్శకత్వం బాగా చేశారు. యూత్ కి ఈ సినిమా ద్వారా మంచి సందేశం ఇచ్చారు.

అమెరికా నుంచి కూడా మంచి స్పందన వచ్చింది. హీరో నటన హైలైట్ గా నిలిచింది. దీపక్ హీరో పాత్రలో ఒదిగిపోయారు.

హీరోయిన్ పాత్ర బాగా చేశారు. చిత్రం విజయ వంతం చేసిన ప్రేక్షకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

లియంగ్ హీరోలి లిదీపక్ సరోజ్‌లి మాట్లాడుతూ, ఈ సినిమా ద్వారా నిర్మాత కు సక్సెస్ వచ్చింది అని పేర్కొన్నారు . తెలుగు రాష్ట్రాల్లో మంచి స్పందన వచ్చింది అన్నారు. కథ, దర్శకుడు ని నమ్మాను, మా నమ్మకం నిజమైంది. చిత్రానికి మంచి రివ్యూలు వచ్చాయి అని ఆనందం వ్యక్తం చేశారు.

అర్జున్ రెడ్డి, యానిమల్ సినిమాల తో మా చిత్రాన్ని పిలుస్తున్నారు, కానీ, వాటితో సంబంధం లేదు అని స్పష్టం చేశారు.

క్లైమాక్స్ సీన్ ప్రేక్షకులు బాగా రిసీవ్ చేసుకున్నారు.

ప్రేక్షకులు ఆదరిస్తారు అన్న నమ్మకంతో ఈ తరహా పాత్రతో హీరోగా ప్రేక్షకుల ముందుకు వచ్చాను.

2003 లో తాను బాల నటుడిగా నటన ప్రారంభించాను అని గుర్తు చేశారు. ఈ సినిమా సక్సెస్ తో వరల్డ్ కప్ కొట్టినంత ఆనందంగా వుంది.

పైసా వసూల్ సినిమా ఇది అని సంతోషం వ్యక్తం చేశారు.

హీరోయిన్ తన్వి నెగీ మాట్లాడుతూ సినిమాలో తన పాత్రకు మంచి స్పందన వచ్చింది అన్నారు.

నిర్మాత ఫణి నమ్మకం ఈరోజు నిజమైంది.

దర్శకుడు తన పాత్ర బాగా మలిచారు అని ప్రశంసించారు. వీకెండ్ కూడా ప్రేక్షకుల ఆదరణ మరింత పెరుగుతుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు.

వైసీపీ నాయకురాలు, హీరో తల్లి రమణి కుమారీ మాట్లాడుతూ సిద్దార్థ రాయ్ సినిమా తొలి రోజే మంచి బజ్ క్రియేట్ చేసింది అన్నారు. చిత్రకథ కథనం ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయ్యింది. సినిమాలో హీరోయిన్‌కి హీరోతో సమాన ప్రాధాన్యత వుంది అని కొనియాడారు. చిత్ర క్లైమాక్స్ కనీరు పెట్టించింది అన్నారు. అనంతరం యూనిట్ సభ్యులు కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

## గన్నెల పంచాయతీ లో బీజేపీ ప్రజా పోరు యాత్ర



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** అత్యోదయ సిద్ధాంతం బీజేపీ అమలు చేస్తుందన్నారు బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక, శనివారం ఆరకువేలి అసెంబ్లీలో ప్రజా పోరు యాత్ర లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశంలో అట్టడుగు పేదలకు ప్రభుత్వ పథకాలను అందించేందుకు బీజేపీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషి చేస్తున్నారు అని తెలిపారు, ప్రతీ పేదవారికి బ్యాంకు ఖాతాలు, ప్రభుత్వ పథకాలు నేరుగా వారి ఖాతాలో జమ చేస్తున్నారు అని ప్రతీ పేదవారికి ఉచితంగా బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు, అని తెలిపారు, గ్రామాల్లో ప్రతీ ఇంటికి ఉచితంగా 200 వరకూ విద్యుత్ సరఫరా చేస్తున్నారు అని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇస్తున్న పథకాలను రాష్ట్ర ప్రభుత్వం స్టిక్కర్ వేసుకొని తన పథకాలుగా చెప్పుకొంటున్నారు అని తెలిపారు, రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఎన్నుకోవాలి అని కోరారు,ఈ కార్యక్రమంలో బీజేపీ ఆరకువేలి మండల అధ్యక్షుడు రామచందర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బలరామ్, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోంబినాయుడు, తదితరులు హాజరయ్యారు.

## మహిళలు అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రతి మహిళా సాధికారితా దిశగా ఎదగాలని సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ పి. ఎస్. నరసింహ ఆకాంక్షించారు. దేశంలో తొలి మహిళా న్యాయవాది అయిన ఫాతిమా బీబీ, భారత దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులో తొలి మహిళా జడ్జిగా పనిచేసిన సంగతిని గుర్తు చేశారు. ఆ కాలంలో సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉన్న రోజుల్లోనే స్త్రీలు న్యాయవాద వృత్తిలో అడుగుపెట్టి తమని తాము నిరూపించుకున్నారని తెలిపారు. నేటి ఆధునిక యుగంలో స్త్రీలు మరింత పురోగతి సాధించాలని, విజయవంతంగా రాణించాలని ఈ సందర్భంగా మహిళా న్యాయవాదులను ఉద్దేశించి పేర్కొన్నారు.

నగరంలోని మహిళా న్యాయవాదుల ఆధ్వర్యంలో శనివారం మహిళా సాధికారత - రాజ్యాంగ పరమైన ఆవశ్యకత అనే అంశంపై స్థానిక గ్రీన్ పార్క్ హెూటల్ లో ఒక రోజు సదస్సు జరిగింది. సదస్సుకు సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు అతిథులుగా హాజరయ్యారు.

ముఖ్య అతిథిగా హాజరైన సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ పి.ఎస్.నరసింహ మాట్లాడుతూ మహిళలు పని చేసే చోట తగిన గౌరవం ఉండాలని, కానీ నేటికీ పలు చోట్ల మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇంత మంది మహిళా న్యాయవాదులను విశాఖపట్నంలోనే చూశానని, ఇదే ప్రప్రథమని అన్నారు. మహిళా న్యాయవాదులు భవిష్యత్తులో మరింత ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ మహిళల సాధికారితపై ఇటువంటి సదస్సు జరగడం సంతోషకరమని అన్నారు. విశాఖలో సుమారు 400 మంది మహిళా న్యాయవాదులతో సదస్సు నిర్వహించడం, దీనికి సుప్రీం కోర్టు జడ్జి హాజరుకావడం ప్రప్రథమం అని గుర్తు చేశారు. 1988 నుంచి మహిళా న్యాయవాదుల ఆధ్వర్యంలో ఇలాంటి సదస్సులు విజయవంతంగా జరుగుతున్న విషయాన్ని ప్రస్తావించారు. 2011, 2017, 2019 సంవత్సరాల్లో విశాఖలో న్యాయవాద సదస్సులు నిర్వహించి జయప్రదం చేశారని వివరించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ సదస్సును ఉద్దేశించి మాట్లాడారు. మహిళలు దేనికీ తక్కువ కాదని ధైర్యంగా ముందుకెళ్లాలని, మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని హితవు పలికారు. అన్ని అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని, ఇతరులకు మార్గదర్శకులుగా నిలవాలని ఆకాంక్షించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్. రాంబాబు మాట్లాడుతూ విశాఖపట్నం బార్ అసోసియేషన్ ఎప్పుడు మహిళలకి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీలుగా ఉమాబాల, అనురాధ పదవులు చేపట్టారని తెలిపారు. పురుషులతో సమానంగా ప్రాక్టీస్ చేస్తున్నటువంటి మహిళా న్యాయవాదులు ఉన్నారని, తమ అసోసియేషన్ మహిళా న్యాయవాదులని ప్రోత్సహించడంలో ముందుంటుందని అన్నారు.

అనంతరం సుప్రీం కోర్టు, హైకోర్ట్ చీఫ్ జస్టిస్‌లు, సీనియర్ న్యాయమూర్తులను దుస్సాలువ, జ్ఞాపికలతో ఆహ్వానితులు, యువ మహిళా న్యాయవాదులు తదితరులు ఘనంగా సత్కరించారు.

సీనియర్ న్యాయవాది డి. అరుణ కుమారి అధ్యక్షత వహించిన ఈ సదస్సులో హైకోర్టు జడ్జి, విశాఖపట్నం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి యు. దుర్గాప్రసాదరావు, హైకోర్ట్ జడ్జిలు జస్టిస్ బి. ఎస్. భానుమతి, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, విశాఖపట్నం డిస్ట్రిక్ట్ జడ్జి ఆలపాటి గిరిధర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి. శేషమ్మ, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## విలాస్ ఖాన్ పాలెం లో 100 కెవి అదనపు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ప్రారంభోత్సవం



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** పద్మనాభం మండలం విలాస్కాన్ పాలెంలో గ్రామంలో గత 42 సంవత్సరాల నుండి ఒకే ట్రాన్స్ఫర్మర్ ద్వారా విద్యుత్ సరఫరా వలన గ్రామంలోలో ఓల్టేజ్ సమస్యలు ఎక్కువగా ఉండుటచే ఈ సమస్యను భీమిలి ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావుకు గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఈ సమస్యను విన్నవించుకోగా వారి ఆదేశాలతో ఈ అదనపు ట్రాన్స్ఫర్మర్ మంజూరు కాబడింది. శనివారం ఈ విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ ను ప్రారంభించిరి ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో MPTC బోని సావిత్రి, సర్పంచ్ నల్లి సత్యవతి, గ్రామ పెద్దలు మరియు APEPDCL ADE, సబ్ - ఇంజనీర్ లు పాల్గొన్నారు. ట్రాన్స్ఫరం ప్రారంభించి సమస్య పరిష్కారం కావడంతో భీమిలి ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ కు పద్మనాభ ఎంపీపీ కే రాంబాబు కు విలాస్కాన్ పాలెం గ్రామ ప్రజలు ప్రత్యేకమైన ధన్యవాదములు తెలిపారు.

## ప్రజా పరిచయ కార్యక్రమంలో అలుపెరగని స్వతంత్ర అభ్యర్థి నాగోతి నాగమణి



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి నియోజకవర్గం అనందపురం మండలంలో పరదేశి పాలెం, కొత్త పరదేశి పాలెం, పాత పరదేశి పాలెం, బోరవానిపాలెం గ్రామాలలో ఉన్న ప్రజలను పరిచయం చేసుకునీ, ప్రజల యొక్క కష్టాలను అడిగి తెలుసుకుంటూ గ్రామంలో ఉన్న పెద్దలతో మహిళలతో మాట్లాడారు.తాను నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తనను వారి యొక్క అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలి కోరుకున్నారు. నన్ను గెలిపించిన వెంటనే గ్రామాలలో ఉన్న పనులన్నీ పూర్తి చేస్తాను అని హామీ ఇచ్చారు. అలాగే మీకు ఏ కష్టం వచ్చినా మీకు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా మద్దతుదారులు నాగోతి భాస్కరరావు, ఇల్లిపల్లి శ్రీనివాసరావు, తమ్మిన రామకృష్ణారావు, తమ్మిన ఎల్లారావు, పి రాజు, వీర మహిళలు, గ్రామస్తులు, మొదలగు వారు పాల్గొన్నారు.

## బేటి బచావో బేటి పఢావో కార్యక్రమం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** డిస్టిక్ లెవెల్ ఓరియంటేషన్ ప్రోగ్రాం స్థానిక సత్యలక్ష్మి గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో బేటి బచావో బేటి పడావో ప్రోగ్రాంలో భాగంగా అనకాపల్లి జిల్లాలో ఉన్న పురోహితులకు, పాస్టర్స్‌లకు, ముస్లిం పెద్దలకు ఓరియంటేషన్ ట్రైనింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు డిస్ట్రిక్ట్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ కె. అనంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంనకు దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాములమ్మ, ఎం. శరత్ బాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధానికి సీఎం పిఐలు బాల్య వివాహ నిరోధక అధికారులు తెలియజేస్తూ రక్షణ సంరక్షణ అవసరమైన పిల్లల విషయంలో సిడబ్ల్యూసి ఎప్పుడూ తగు జాగ్రత్తలతో వారిని ఏదైనా రక్షణ గృహాలకు పంపడానికి చర్యలు తీసుకుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమం జిల్లా ప్రొబేషన్ అధికారి శరత్, బాలల న్యాయ రక్షణ సంరక్షణ చట్టం గురించి మాట్లాడారు. ఎస్సై రాములమ్మ మాట్లాడుతూ బాలల హక్కుల ఉల్లంఘన ఎక్కడ జరిగినా, వారికి తెలియజేసినచో తక్షణ చర్యలు తీసుకొని బాలల హక్కుల రక్షణ ఉల్లంఘన లేకుండా చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకుంటారని తెలియజేశారు. ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అనంతలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కడన్నా జరుగుతున్నట్టు సమాచారం ఇచ్చినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమం ముగింపుగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం పప్రొటెక్షన్ ఆఫీసర్ పి లక్ష్మీ ధన్యవాదములు తెలియ జేస్తూ, ఇతర సహాయ సహకారానికి, 9966141470 నంబరుకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, పురోహితులు, పాస్టర్స్ కూడా మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధానికి వారందరూ స్వచ్ఛందంగా సహకరిస్తామని సభాముఖంగా తెలియజేయడం జరిగినది. స్వచ్ఛంద సంస్థ మరియు ఐసిపిస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవోపేతంగా శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి కళ్యాణం



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలో కొత్తపేట శివాలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం సాయంత్రం శ్రీ శ్రీ శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారి దివ్యలీలా కళ్యాణాన్ని ఆలయ అర్చకులు మేకా భగవాన్ రామ్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చా రణలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణ పుర వీధులలో సాయంత్రం నాడు విగ్రహాలను అం గరంగ వైభవంగా భక్తుల భజనలు నడుమ ఊరేగింపు చేసి అనంతరం ఎదురు సన్నాహం కార్యక్రమం అనంతరం శివాలయంలో కళ్యాణమును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కౌన్సిలర్ పిల్లా కనకమణి,త్రినాధ్ రావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు వీరందరికీ అల్పాహారాన్ని అందజేశారు.

## మాఘ పూర్ణిమ సందర్భంగా తీరప్రాంతం జన సంద్రం



**రాంబిల్లి, (విశాఖ సమాచారమ్):** మండలంలో గల సముద్ర తీర ప్రాంతాలైన వాడ రాంబిల్లి, వెంకయ్యపాలెం, లోవపాలెం గ్రామాలలో గల సముద్ర తీర ప్రాంతంలో శనివారం మాఘ పూర్ణిమ సందర్భంగా వేలాది మంది భక్తులు స్నానాలు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమీప గ్రామాల నుండి వేల సంఖ్యలో భక్తజనం తరలివచ్చి స్నానాలాచరించి, సమీపంలో ఉన్న దేవాలయాలలో అమ్మవారి దర్శనం చేసుకున్నారు. సిఐ లక్ష్మణరావు పర్యవేక్షణలో తదితర సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎక్కడా ఎటువంటి అవాంతరాలు జరగకుండా కొన్ని ప్రదేశాలలో పోలీసులు, మత్స్యకార వాలంటీర్లు భక్తులకు నిర్దేశించిన ప్రదేశం కంటే లోపలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

## అప్పన్న సన్నిధిలో హైకోర్ట్ జడ్జి జస్టిస్ భానుమతి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సింహాచలం అప్పన స్వామివారిని హై కోర్ట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ జడ్జ్ జస్టిస్ భానుమతి దర్శించుకున్నారు. వీరికి ఏ ఈ ఓ పాలూరి నర్సింగరావు, ఆలయ పర్యవేక్షణ అధికారి పిల్లా శ్రీనివాస్, అర్చక స్వాములు, వేద పండితులు, నాదస్వర వేదమంత్రాలతో స్వాగతం పలికి ముందుగా కప్ప స్తంభం ఆలింగనం, బేడ మండపం ప్రదక్షిణ అనంతరము స్వామివారి దర్శనము, తదుపరి వేద పండితులచే వేద ఆశీర్వచనం ఇచ్చి స్వామి వారి శేష వస్త్రముతో సత్కరించారు. స్వామివారి ప్రసాదాలను సహాయ కార్య నిర్వహణ అధికారి పాలూరి నర్సింగరావు అందజేశారు. వీరితో గోపాలపట్నం పోలీస్ అప్పలనాయుడు, తదితరులు ఉన్నారు.

# డయాబెటిక్ పేషెంట్స్ చేసే ఈ తప్పులతో షుగర్ పెరుగుతుంది




డయాబెటిస్. అదో దీర్ఘకాలిక అనారోగ్య పరిస్థితి. వచ్చిందంటే అంత ఈజీగా పోదు. చాలా మందికి అస్సలే పోదు. జీవితాంతం దానిని భరిస్తూనే ఉండాలి. మధుమేహాన్ని నిర్వహించడానికి రక్తంలో చక్కెర స్థాయిలను వీలైనంత సాధారణ స్థాయికి దగ్గరగా ఉంచుకోవడం కీలకం. మందులు తీసుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం లాంటి చర్యలతో బ్లడ్ షుగర్ ను కంట్రోల్ లో ఉంచుకోవచ్చు.

అయితే డయాబెటిక్ పేషెంట్లు చేసే కొన్ని తప్పుల వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. దీని వల్ల వ్యాధి తీవ్రత పెరిగి సమస్యలు చుట్టు ముడతాయి.

**వైద్యులు సూచించినట్లుగా మందులు వేసుకోకపోవడం:** వైద్యుల సూచనల మేరకు మందులు వాడటం చాలా కీలకం. మోతాదు మించినా, తగ్గించినా దాని వల్ల సమస్యలు తప్పవు. దీని వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి.

**ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోకపోవడం:** మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యకరమైన ఆహారంలో పుష్కలంగా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర పానీయాలు, అనారోగ్యకరమైన కొవ్వులు తీసుకోవడాన్ని పరిమితం చేయాలి.

**క్రమం తప్పకుండా వ్యాయామం చేయకపోవడం:** వ్యాయామం చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడానికి, ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. వారంలో ఆరు రోజులు రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.

**తగినంత నిద్రపోకపోవడం:** తగినంత నిద్ర లేకపోయినా, శరీరం ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్ ను ఎక్కువగా ఉత్పత్తి చేస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. రోజూ తప్పనిసరిగా 7 నుంచి 8 గంటల పాటు నిద్రపోవాలి.

**ధూమపానం:** ధూమపానం రక్త నాళాలను దెబ్బతీస్తుంది. శరీరం ఇన్సులిన్‌ను వాడటాన్ని కష్టతరం చేస్తుంది. మీరు డయాబెటిక్ పేషెంట్ అయితే ధూమపానం చేయడాన్ని మానేయాలి.

**బ్లడ్ షుగర్ నిర్వహణకు చిట్కాలు:** రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకోవాలి, సమతుల్య ఆహారం తినాలి, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. తరచూ రక్తంలో చక్కెర స్థాయిలను తనిఖీ చేసుకోవాలి. సురక్షితమైన స్థాయిలోనే చక్కెర స్థాయి ఉన్నట్లు నిర్ధారించుకోవాలి. రక్తంలో చక్కెర స్థాయిలు చాలా ఎక్కువగా ఉంటే, మందులు తీసుకోవాలి. తరచూ చిరుతిండి తినాలి.

# టీతో పాటు రస్కులు తినే వారు జాగ్రత్తగా ఉండాలి, గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుంది



ఉదయం టీ అయినా, సాయంత్రం స్నాక్ అయినా, అర్ధరాత్రి తృష్ణ టీ అయినా, చాలా మందికి రస్క్ అంటే టోస్ట్ తినాలని చాలా కోరిక ఉంటుంది. దాని కరకరలాడే మిమ్మల్ని తినమని బలవంతం చేస్తుంది. మీకు ఆకలిగా ఉంటే మరియు ఏదైనా తయారు చేయాలని అనిపించకపోతే, తక్షణమే మీ ఆకలిని తీర్చడానికి టీతో రస్క్ ఉత్తమ మార్గం.

అయితే కొన్ని నిమిషాల్లోనే మీ ఆకలిని తీర్చే ఈ రస్క్ తినడం వల్ల అనేక నష్టాలు ఉన్నాయి. ముఖ్యంగా రస్క్‌తో టీ కలపడం మీ ఆరోగ్యానికి చాలా హానికరం. మీ రోజువారీ ఆహారంలో రస్కలను చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య నష్టాలు కూడా ఉన్నాయి. రస్క్‌లో గ్లూటెన్, శుద్ధి చేసిన పిండి మరియు చక్కెర ఉంటాయి, ఇవి మీ ఆరోగ్యానికి హానికరం.

1. **ఊబకాయం పెరిగే ప్రమాదం** రస్క్ తినడం వల్ల మీ ఆహార కోరికలు కూడా పెరుగుతాయి, దీని కారణంగా మీ బరువు త్వరగా పెరగడం ప్రారంభమవుతుంది. రస్క్‌లో అధిక చక్కెర మరియు శుద్ధి చేసిన పిండి ఉంటుంది, ఇది ఊబకాయానికి కారణమవుతుంది.

2. **రస్క్‌లో ఎలాంటి పోషకాలు ఉండవు** రస్క్ తినడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనం ఉండదు, ఎందుకంటే ఇందులో ఎలాంటి పోషకాలు ఉండవు. దీన్ని తినడం వల్ల మీ శరీరంలో మంట పెరుగుతుంది. శుద్ధి చేసిన పిండిని రస్క్ చేయడానికి ఉపయోగిస్తారు, ఇందులో ఫైబర్ లేదా ఇతర పోషకాలు ఉండవు. ఎక్కువ కాలం నిల్వ ఉంచడానికి, కొన్ని రసాయనాలు జోడించబడతాయి, ఇది మీ ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది.

3. **మధుమేహం సమస్య పెరగవచ్చు** రస్క్ చక్కెర, రిఫైన్డ్ ఆయిల్, మైదా, గ్లూటెన్ మిశ్రమం నుండి తయారవుతుంది, ఇది మీ శరీరానికి అనేక సమస్యలను కలిగిస్తుంది. ఇందులో ఉపయోగించిన వస్తువులు డయాబెటిక్ పేషెంట్ ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. అటువంటి పరిస్థితిలో, రస్క్ తినడం వల్ల మీ రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది, ఇది మధుమేహం ప్రమాదాన్ని పెంచుతుంది.

4. **మలబద్ధకం సమస్య పెరగవచ్చు** మీ ఆహారంలో క్రమం తప్పకుండా రస్క్‌ని చేర్చుకోవడం వల్ల మలబద్ధకం ఏర్పడుతుంది. రస్క్ తినడం ద్వారా మీ పేగులో చెడు బ్యాక్టీరియా పెరగడం ప్రారంభమవుతుంది. దీని వల్ల మీ రోగనిరోధక శక్తి బలహీనపడవచ్చు. రోగనిరోధక శక్తి బలహీనపడటం వల్ల జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం కూడా ఉంది. ఇది కడుపు సమస్యలను పెంచుతుంది.

5. **గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుంది** రస్క్ చేయడానికి పిండి, నూనె మరియు చక్కెరను ఉపయోగిస్తారు. ఇది మీ గుండె యొక్క సిరలను నిరోధించవచ్చు, ఇది గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది.

# చుండ్రుతో హెయిర్ ఫాల్



మీరు అందంగా కనిపించడంలో మరియు మంచి అనుభూతి చెందడంలో మీ జుట్టు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అందువల్ల, మీ జుట్టును జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. కనీసం వారానికి ఒకసారైనా నూనె, షాంపూ, కండిషనింగ్ వంటివి చేయాలి. జుట్టు పొడిబారడం, జుట్టు రాలడం, నెరిసిన జుట్టు, బలహీనమైన జుట్టు వంటి సాధారణ జుట్టు సమస్యలు ఉన్నవారు తగిన కండీషనర్‌ని ఉపయోగించాలి. కండిషనింగ్ అనేది మీ జుట్టును మృదువుగా, మెరుస్తూ మరియు హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సహాయపడే ఒక పద్ధతి. మీకు తక్షణ ఫలితాలను అందించగల రసాయనాలతో కూడిన కండీషనర్లు మార్కెట్లో పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి. ఇవి మీ జుట్టుకు మంచివి కావు.

డ్యామేజ్ అయిన జుట్టును రక్షించడానికి మరియు నిర్వహించడానికి నేచురల్ కండీషనర్ గ్రేట్‌గా సహాయపడుతుంది. మీకు సులభంగా లభించే సహజసిద్ధమైన పదార్థాలను సేకరించడం ద్వారా మీరు ఇంట్లోనే రసాయన రహిత కండిషనర్‌లను తయారు చేసుకోవచ్చు.

**అరటి జుట్టు కండీషనర్**

**కావలసినవి:** తురిమిన అరటిపండు ఒకటి, తేనె 3 టేబుల్ స్పూన్లు, పాలు 3 టేబుల్ స్పూన్లు, ఆలివ్ ఆయిల్ మరియు గుడ్డు పచ్చ సొన మూడు టేబుల్ స్పూన్లు తీసుకోండి.

**విధానం:** అన్ని పదార్థాలను కలిపి మెత్తగా పేస్ట్ చేయాలి. దీన్ని జుట్టుకు పట్టించి 20-30 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. చల్లని నీరు మరియు షాంపూతో మీ జుట్టును బాగా కడగాలి.

**వెనిగర్ మరియు గుడ్డు కండీషనర్**

**కావలసినవి:** 2-3 గుడ్లు, ఒక టేబుల్ స్పూన్ వెనిగర్, రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం, ఒక టేబుల్ స్పూన్ ఆలివ్ ఆయిల్ మరియు ఒక టేబుల్ స్పూన్ తేనె.

**విధానం:** మందపాటి పేస్ట్‌గా ఉండేలా బ్లెండర్‌లో పదార్థాలను కలపండి. దీన్ని జుట్టు చివర్లకు అప్లై చేసి 15-20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తరువాత, మీ జుట్టును గోరువెచ్చని లేదా చల్లటి నీటితో బాగా కడగాలి.

**కొబ్బరి నూనె, పెరుగు మరియు తేనె కండీషనర్**

**కావలసినవి:** ఒక టేబుల్ స్పూన్ కొబ్బరి నూనె, ఒక టేబుల్ స్పూన్ తేనె, ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం, రెండు టేబుల్ స్పూన్ల పెరుగు మరియు ఒక టేబుల్ స్పూన్ రోజ్ వాటర్.

**విధానం:** అన్నింటినీ బాగా మిక్స్ చేసి, ఆ పేస్ట్‌ని జుట్టుకు పట్టించాలి. 15-20 నిమిషాలు తలపై ఉంచండి. తరువాత, చల్లని నీటితో జుట్టును బాగా కడగాలి.

**పెరుగు జుట్టు కండీషనర్**

**కావలసినవి:** ఆరు టేబుల్ స్పూన్ల పెరుగు మరియు ఒక గుడ్డు.

**విధానం:** పెరుగు వేసి గుడ్లు బాగా కొట్టండి. ఈ మిశ్రమాన్ని మీ జుట్టుకు పట్టించి బాగా మసాజ్ చేయండి. మీ జుట్టును మృదువైన టవల్ లేదా గుడ్డతో కప్పండి. కనీసం 30 నిమిషాలు అలాగే ఉంచండి మరియు మీ జుట్టును చల్లటి నీటితో శుభ్రం చేసుకోండి.

**ఆపిల్ సైడర్ వెనిగర్ కండీషనర్**

**కావలసినవి:** రెండు టేబుల్ స్పూన్ల ఆపిల్ సైడర్ వెనిగర్, ఒక టేబుల్ స్పూన్ తేనె మరియు రెండు కప్పుల నీరు.

**విధానం:** అన్ని పదార్థాలను బాగా మిక్స్ చేసి మెత్తగా పేస్ట్ చేయాలి. దీన్ని మీ జుట్టుకు అప్లై చేయండి. తరువాత, 15-30 నిమిషాల తర్వాత చల్లని నీటితో జుట్టును కడగాలి.

**అలోవెరా హెయిర్ కండీషనర్**

**కావలసినవి:** నాలుగు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం

**విధానం:** పదార్థాలను బాగా మిక్స్ చేసి మెత్తగా పేస్ట్ చేయాలి. ఈ పేస్ట్‌ను మీ జుట్టుకు అప్లై చేసి కొంత సమయం తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి.

# ఎలక్ట్రిక్ టూత్‌బ్రష్ వాడాలనుకుంటున్నారా?




ఉదయం పళ్లు తోమడం నుంచే రోజు ప్రారంభమవుతుంది. ఇది చాలా మందికి ఉన్న అలవాటే. కొందరు బ్రష్‌లు, వేప పుల్లలు, చేతులతో పళ్లను, నాలుకను శుభ్రం చేసుకుంటారు. ఈ మధ్యకాలంలో ఎలక్ట్రిక్ టూత్‌బ్రష్‌లు కూడా వచ్చాయి. వీటిని అలా పళ్లపై పెట్టుకుని స్విచ్ నొక్కితే చాలు అవే పళ్లను శుభ్రం చేస్తుంటాయి. ఈ మధ్య కాలంలో ఎలక్ట్రిక్ టూత్‌బ్రష్ లు వాడే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మీరు కూడా ఎలక్ట్రిక్ టూత్‌బ్రష్ కొనాలనుకుంటుంటే వాటి ద్వారా కలిగే లాభాలేంటో, నష్టాలేంటో ముందుకు తెలుసుకోండి.

**మాన్యువల్ టూత్‌బ్రష్ ప్రయోజనాలు :** మాన్యువల్ టూత్‌బ్రష్‌ల వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. చిన్నప్పటి నుంచి టూత్ బ్రష్‌లు వాడటం చాలా మందికి అలవాటు.

**ధర :** మాన్యువల్ టూత్‌బ్రష్‌లు ఎక్కడైనా లభిస్తాయి. చిన్న చిన్న కిరాణ షాపుల నుంచి మాల్స్ వరకు ఎక్కడైనా చాలా చౌకగా అందుబాటులో ఉంటాయి. రంగు, పరిమాణం, ముళ్ల సున్నితత్వం ఇలా చాలా రకాలు అందు బాటులో ఉంటాయి. ఎక్కడి కైనా ఈజీగా తీసుకెళ్లవచ్చు. బ్యాటరీలపై, పవర్ పై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. సులభంగా మార్చేసి వేరేది వాడుకోవచ్చు.

**మాన్యువల్ టూత్‌బ్రష్‌లు ప్రతికూలతలు:** వీటికి టైమర్లు అంటూ ఏమీ ఉండవు. పళ్లను సరైన పద్ధతిలో తోముకునేందుకు సహాయం ఉండదు. పిల్లలు, వికలాంగులు ఉపయోగించడం కాస్తంత కష్టం. కఠినంగా బ్రష్ చేస్తే చిగుళ్ల సమస్యలు రావొచ్చు

**ఎలక్ట్రిక్ టూత్‌బ్రష్ ప్రయోజనాలు:** పిల్లలకు, వికలాంగులకు ఎలక్ట్రిక్ టూత్‌బ్రష్ లు చాలా ఉపయుక్తంగా ఉంటాయి. పళ్లపై పేరుకు పోయిన ప్లాక్‌ను తొలగించడం చాలా సులభం. బ్రేసెస్ ఉన్నప్పటికీ పళ్లను శుభ్రం చేయడం సులభం. పళ్లు తోముకోవడం చాలా ఎగ్జైటింగ్ గా ఉంటుంది.

**ఎలక్ట్రిక్ టూత్‌బ్రష్ ప్రతికూలతలు:** ధర చాలా ఎక్కువ. టూత్‌బ్రష్ హెడ్స్ తరచూ మార్చాల్సి ఉంటుంది. ఎలక్ట్రిక్ టూత్‌బ్రష్‌లు పాడయ్యే అవకాశాలు ఉంటాయి. ఎలక్ట్రిక్ టూత్‌బ్రష్‌లు కింద పడితే పాడవుతాయి.

# మంచిదని చియా విత్తనాలను బాగా తింటున్నారా?



ఉరుకుపరుగుల జీవితం వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు దీంతో చాలామంది ఆరోగ్యంపై దృష్టిసారిస్తున్నారు. ఈ రోజుల్లో పెరుగుతున్న ఆరోగ్య సంబంధిత సమస్యల దృష్ట్యా చియా విత్తనాలకు చాలా క్రేజ్ ఉంది. బరువు తగ్గించుకోవడానికి చియా విత్తనాలను ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ విధంగా, చియా విత్తనాలు అనేక రకాల బరువు తగ్గించే పానీయాలు, స్మూతీస్, సలాడ్‌లకు జోడించి తీసుకుంటారు. అయితే, చియా విత్తనాలలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఫ్రీ రాడికల్స్ ప్రతికూల ప్రభావాల నుండి శరీరాన్ని రక్షించడానికి ఇవి బాగా పనిచేస్తాయి.

చియా సీడ్స్‌లో చాలా గుణాలు ఉన్నప్పటికీ, ఇవి ప్రతికూలతలను కూడా కలిగి ఉన్నాయి. చియా విత్తనాలను అధికంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుంది?

**డయాబెటిక్ పేషెంట్లు చియా సీడ్స్ తినకూడదు:** మీరు డయాబెటిక్ పేషెంట్ అయితే పొరపాటున కూడా చియా సీడ్స్ తినకండి. ఎందుకంటే దీన్ని తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయి. వాస్తవానికి, చియా విత్తనాలు రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రిస్తాయి. అయితే, ఈ గింజలు చక్కెర స్థాయి నియంత్రణ మందులను తీసుకోవడం ద్వారా కూడా ప్రతిస్పందనగా మారుతాయి.

**రక్తం పలుచగా మారుతుంది:** లోతైన గాయం విషయంలో, శరీరంలో రక్తం గడ్డకట్టే ప్రక్రియ సరిగ్గా పనిచేసినప్పుడు మాత్రమే గాయం రక్తస్రావం ఆగిపోతుంది. అయితే చియా సీడ్స్‌లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. దీని వల్ల రక్తం పలుచగా మారుతుంది. చియా విత్తనాలు రక్తాన్ని మరింత పలచబరుస్తాయి. అందుకే చియా గింజలను ఎక్కువగా తినకూడదు.

**అజీర్ణం-బరువు పెరగడం:** చియా గింజల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. మీరు చియా విత్తనాలను రోజుకు 4 నుండి 5 సార్లు తీసుకుంటే, అది అజీర్ణానికి కారణం కావచ్చు. ఎందుకంటే పీచు ఎక్కువగా ఉండడం వల్ల త్వరగా జీర్ణం కాదు. ఇలాంటి పరిస్థితుల్లో మీరు చియా విత్తనాలను ఎక్కువగా తింటే, బరువు కూడా వేగంగా పెరుగుతుందంటున్నారు.

# చక్కెర ఎక్కువ తింటే మరీ అంత ప్రమాదమా?



తినేటప్పుడు తియ్యగా, రుచికరంగా ఉంది కదా అని ఎక్కువ పంచదార తిన్నారనుకోండి అది మీ ఆరోగ్యానికి హాని చేస్తుంది. ముఖ్యంగా అధిక మోతాదులో తీసుకున్న పంచదార వల్ల శరీరంలో కొవ్వు తయారై అది శరీరంలో పేరుకుపోతుంది. ఫలితంగా అధిక బరువు పెరిగేందుకు కారణం అవుతుంది. అది కాస్తా మధుమేహం, ఊబకాయానికి దారితీస్తుంది. అంతేకాదు అధిక మొత్తంలో చక్కర తింటే మీ శరీరంలో జరిగే మార్పులు ఏంటి? ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి అనే విషయం ఇప్పుడు తెలుసుకుందాం.

సాధారణంగా చక్కెరలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ ఉంటాయి. గ్లూకోజ్‌ని మన శరీరంలోని ప్రతి కణం వినియోగించుకుంటుంది కానీ ఫ్రక్టోజ్ విషయంలో అలా కాదు. ఫ్రక్టోజ్ కాలేయంలో మాత్రమే మెటాబలైజ్ అవుతుంది అని బెంగళూరులోని మణిపాల్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్, జనరల్ జిఐ అండ్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ ప్రవీణ్ చెప్పుకొచ్చారు. కాలేయంలోకి చేరుకున్న అదనపు ఫ్రక్టోజ్ కొవ్వుగా మారుతుంది. అదే కానీ జరిగితే ఆ తరువాత కాలేయ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంది. క్రమక్రమంగా అది హైపర్ ట్రైగ్లిజరిడెమియాగా మారుతుంది. అయ్యో ఇప్పటికే ఎక్కువ మోతాదులో చక్కర వినియోగించే అలవాటు ఉంది కదా మరి మా ఆరోగ్యం పరిస్థితి ఏంటి అని ఆందోళన చెందుతున్నారా? దానికి కూడా ఒక పరిష్కారం ఉంది. లిపిడ్ ప్రొఫైల్ రక్త పరీక్షతో ఆ వ్యాధిని నిర్ధారించుకోవచ్చు.

వాస్తవానికి ఫైబర్ పుష్కలంగా ఉండే కూరగాయలు లేదా పండ్లు లేదా తృణ ధాన్యాలు ఆహారంగా తీసుకున్నప్పుడు మెదడు లోని సంతృప్త కేంద్రం ఉత్తేజితం అవుతుంది. ఈ కారణంగానే ఎక్కువ ఆహారం తీసుకోవాలి అనే కోరిక కలగకుండా ఉంటుంది. అలా కాకుండా చక్కెర, ఉప్పు, ఫ్యాట్స్ కలిసిన ఆహార పదార్థాలు తిన్నప్పుడు అవి ఆకలిని తీర్చలేవు. అందుకే మరీ మరీ తినాలి అనే కోరిక కూడా కలుగుతుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారానికి, చక్కెర, ఉప్పు, కొవ్వు పదార్థాలు అధికంగా ఉన్న వాటికి మధ్ తేడా అదే.

చక్కెర అధికంగా తినే వారికి ఆ అలవాటు ఉండటానికి శాస్త్రీయంగా ఒక కారణం ఉంది. ఎవరైనా అధిక మోతాదులో చక్కెరను తిన్నప్పుడు వారి శరీరంలో జరిగే మార్పు ఏంటంటే చక్కెరను ఇష్టపడే బ్యాక్టీరియా సంఖ్య పెరుగుతుంది. క్రమక్రమంగా అది డైస్బియోసిస్‌గా మారుతుంది. అంటే మీ ఒంట్లో ఒక రకమైన బ్యాక్టీరియా పెంపొందుతుంది. ఆ బ్యాక్టీరియా చక్కరనే ఆహారంగా తీసుకుంటుంది. అందుకే మీ శరీరం కూడా చక్కెరనే కోరుకుంటుంది. ఈ కారణంగానే చక్కెర ఎక్కువ తినే అలవాటు ఉన్న వారు కూడా మద్యం తరహాలో చక్కెరకు బానిస అవుతుంటారు. అలా అధిక మొత్తంలో తినే చక్కర అనేక రకాలుగా మీ శరీరానికి హాని చేస్తుంది. ఉదాహరణకు, శరీరంలో కొవ్వు పెరగడం, స్థూలకాయం రావడం, మధుమేహం రావడం, దంతాల్లో పుప్పి తయారవడం లాంటి ఎన్నో సమస్యలకు ఇది మూల కారణం అవుతుంది.

# బాదంతో లాభాలే కాదు దుష్పరిణామాలు కూడా



డ్రై ఫ్రూట్స్ పేరు చెప్పగానే ముందుగా గుర్తొచ్చేది బాదం. సంపూర్ణ ఆరోగ్యం కోసం బాదం చేసే మేలు అంతా ఇంతా కాదు. అద్భుతమైన పోషక విలువలుంటాయి బాదంలో. రోజూ క్రమం తప్పకుండా తగిన మోతాదులో బాదం సేవిస్తే ఆరోగ్యానికి చాలా మంచిది.

బాదం, పిస్తా, వాల్ నట్స్, అంజీర్, జీడిపప్పు వంటి డ్రై ఫ్రూట్స్‌లో పోషక పదార్థాలు మెండుగా ఉంటాయి. ఇందులో అతి ముఖ్యమైంది బాదం. ఆరోగ్యపరంగా చాలా ప్రయోజనాలున్నాయి. బాదం ఒక్కటే కాదు బాదం నూనె కూడా ఆరోగ్యానికి చాలా మేలు చేకూరుస్తుంది. మనిషి శరీర నిర్మాణంలో విటమిన్లు, మినరల్స్ పాత్ర కీలకం. ఇవి శరీర నిర్మాణంతో పాటు వికాసానికి కూడా దోహదపడతాయి. బాదంలో ఫైబర్, ప్రొటీన్లు, విటమిన్ ఇ, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. బాదం క్రమం తప్పకుండా తీసుకుంటే ఎముకలకు పటిష్ఠత, బరువు అదుపులో ఉండటం, మానసికంగా సమతుల్యత, గుండె జబ్బులు, కేన్సర్ నియంత్రణలో ఉంటాయి.

అయితే బాదంతో దుష్పరిణామాలు కూడా ఉంటాయనే విషయం చాలామందికి తెలియదు. ఆరోగ్యానికి మంచిది కదా అనే కారణంతో పరిమితికి మించి బాదం తీసుకుంటే ఆరోగ్యానికి అనర్ధమే. ఆరోగ్యానికి ప్రతికూల పరిణామాలు ఎదురౌతాయి. మేలు జరిగే మాట అటుంచితే ప్రతికూల ప్రభావం పడుతుంది. బాదం మోతాదు మించి తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైనవాటికంటే ఎక్కువ మోతాదులో న్యూట్రియంట్లు, మినరల్స్ పెరిగిపోతాయి. ఫలితంగా కడుపులో తిప్పినట్టుండటం, వాంతులు, విరేచనాలు, జీర్ణ సంబంధిత సమస్యలు ఉత్పన్నమౌతాయి. అదే సమయంలో కొంతమందికి లాక్టోస్ అంటే ఎలర్జీ ఉంటుంది. ఈ సమస్య ఉన్నవాళ్లు కూడా బాదం పాలకు దూరంగా ఉండాలి. బాదం పాలలో చక్కెర స్థాయి ఎక్కువగా ఉన్నందున డయాబెటిస్ వ్యాధిగ్రస్థులు తక్కువ మోతాదులోనే బాదం స్వీకరించాలి.

**థైరాయిడ్ సమస్యకు కారణం కానుందా**

బాదం పాలను సాధారణంగా గోయిట్రోజెనిక్ ఆహారంగా పిలుస్తారు. గోయిట్రోజెనిక్ ఆహారం థైరాయిడ్ సమస్యకు మూలకారణాల్లో ఒకటి. అందుకే బాదం పాలు మోతాదుకు మించి తీసుకోవడం వల్ల థైరాయిడ్ సమస్య పెరగవచ్చు. అంటే డ్రై ఫ్రూట్స్ రారాజుగా పిల్చే బాదంతో ఆరోగ్యపరంగా ఎన్ని ప్రయోజనాలున్నా మోతాదు మించితే హాని తప్పదు. సహజంగానే బాదం అనేది ప్రొటీన్ ఫుడ్. ప్రొటీన్లు ఎప్పుడూ తగిన మోతాదులోనే ఉండాలి. లేకపోతే జీర్ణం చేసుకోవడం కష్టమౌతుంది.


# సమస్యలు తీరకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

## విశాఖలో న్యాయవాదుల రౌండ్ టేబుల్




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి న్యాయవాదులు సిద్ధమవుతున్నారు. అందులో భాగంగా విశాఖ పౌర గ్రంథాలయంలో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాంతకుమార్ మాట్లాడుతూ అడ్వకేట్/డెత్ బెనిఫిట్ ఫండ్‌ను రూ.10లక్షలకు పెంచాలని, 35ఏళ్లగా బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్న న్యాయవాదులకు ఈ ఫండ్ సౌకర్యం కల్పించాలని, మృతి చెందిన న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మ్యాచింగ్ గ్రాంట్ రూ.4లక్షల్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గవర్నమెంట్ ప్లీడర్లు, పీపీలు, స్టాండిరగ్ కౌన్సిళ్లు, అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ న్యాయవాదులకు రిజర్వేషన్ల ప్రాతిపదికన నియామకం చేపట్టాలని, న్యాయవాదులకు కూడా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# యాదవులకు ఎంపి ఎంవివి క్షమాపణ చెప్పాలి : యాదవ సంఘాల ఐక్యవేదిక



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఎమ్మెల్సీ వంశీకృష్ణను ఉద్దేశించి మాట్లాడుతూ యాదవులను పంది కులం అని సంభోదించిన విశాఖ ఎంపి ఎం.వి.వి సత్యన్నారాయణ యాదవ కులానికి భేషరతుగా క్షమాపణ చెప్పాలని భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కోడిపోయిన బాబ్జీ డిమాండ్ చేశారు. ఉషోదయ కూడలిలో యాదవ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంవివి సత్యనారాయణ ఒక ప్రెస్ మీట్‌లో వంశీకృష్ణ శ్రీనివాస్‌ని ఉద్దేశిస్తూ మీ జాతి పంది జాతి అని ఉచ్ఛరించటం చాలా దారుణమని, దీనిపై వెంటనే ఎంవివి సత్యనారాయణ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో క్షమాపణ చెప్పకపోతే ఎంవివి ఇల్లు ముట్టడికి కార్యచరణ రూపొందిస్తామని ఆయన హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో నగరంలోని యాదవుల సత్తా ఏమిటో చూపిస్తామని, విశాఖ జిల్లాలో ఉన్న ప్రతి యాదవుడు ఐక్యతతో ఉండి మాకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వని పార్టీలను ఓడించి తీరుతామని ప్రతినబూనారు. విశాఖ తూర్పు నియోజక వర్గంలో వైసిపి అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ ఓటమి కోసం అలుపెరుగని పనిచేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి బొట్ట చిన్న యాదవ్, నమ్మి అప్పలరాజు, యాదవ హక్కుల పోరాట సమితి మాజీ అధ్యక్షులు అనుపమ యాదవ్, బీసీ చైతన్య సమితి విశాఖ జిల్లా జనరల్ సెక్రెటరీ మేకల లక్ష్మీ యాదవ్, యాదవ హక్కుల సేవాసమితి మహిళా ప్రెసిడెంట్ గుంప సత్యవతి యాదవ్, యాదవ హక్కుల పోరాట మహిళా నాయకురాలు నక్క సావిత్రి యాదవ్, సర్వసిద్ధి వెంకటరమణ, దువ్వి హరీష్, తూర్పు నియోజకవర్గ యాదవ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సెయింట్ జోసెఫ్ కళాశాలలో జాతీయ సదస్సు ముగింపు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గత రెండు రోజులుగా కళాశాల బోటనీ విభాగ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారం సాయంత్రంతో ముగిసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రవిశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య కె. సమత విచ్చేసి సదస్సుల ఆవశ్యకత గురించి ప్రసంగించారు. గౌరవ అతిథిగా అటవీ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్ విచ్చేశారు. జాతీయ సదస్సులో పాల్గొన్నవారికి, పత్ర సమర్పణ చేసిన వారికి ప్రమాణ పత్రాలు అందజేశారు. వివిధ సంస్థల నుంచి దాదాపు 100కు పైగా విద్యార్థులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. సదస్సు నిర్వహణ పట్ల వారు సంతృప్తిని వ్యక్తం చేశారు. కన్వీనర్ డాక్టర్ కె. మాణిక్య కుమారి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు డాక్టర్ పద్మ సుందరి, సిస్టర్ హేమ, డాక్టర్ నాగరాజు, కార్యవర్గ సభ్యులు, డా. ఇ. హరిణి, డా. మేరీ అనుపమ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సుధ,ప్రెస్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ పి. కె. జయలక్ష్మి, పాల్గొన్నారు.

# వాల్తేర్ లైన్స్ క్రికెట్ పోటీలను ప్రారంభించిన కార్పొరేటర్ ముvvల



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పెద్ద వాల్తేర్ గ్రామానికి సంబంధించిన వాల్తేర్ లైన్స్ క్రికెట్ అససియేషన్ 3వ వార్షికోత్సవం సందర్భంగా వాల్తేర్ లైన్స్ ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను 20వ వార్డు కార్పొరేటర్ ముvvల లక్ష్మి సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని క్రికెట్ టోర్నమెంట్ను ప్రారంభించారు. ముందుగా క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొన్న టీమ్‌లను పరిచయం చేసుకొని, సురేష్ టాస్ వేసి క్రీడా పోటీలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ సురేష్ మాట్లాడుతూ స్థానిక యువత కలిసిమెలసి క్రీడలు నిర్వహించడం చాలా మంచి వాతావరణం నెలకొందని అన్నారు.

భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని, తమ వంతు సహకారం ఎల్లప్పుడూ వుంటుందని అన్నారు.

క్రీడాకారులకు ఏర్పాటు చేసిన భోజనాన్ని స్వయంగా కార్పొరేటర్ ముvvల లక్ష్మి సురేష్ వడ్డించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు నీలపు రమణ రెడ్డి, పండ శ్రీనివాస్, 20వ వార్డు అధ్యక్షులు కాగితాల రవి కిరణ్ రెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు వాల్తేర్ లైన్స్, స్థానిక యువత, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల పర్యవేక్షణకు నిఘా అధికారుల నియామకం



**విజయనగరం:** ఎన్నికలలో మోడల్ కోడ్ అమలు, మోడల్ కోడ్ ఉల్లంఘన, ఫిర్యాదులు, అభ్యర్థులు, పార్టీల ఎన్నికల వ్యయం తదితర అంశాల పై పర్యవేక్షణ కోసం నియోజకవర్గం వారీగా నిఘా అధికారులను (స్టాటిక్ సర్వేలేన్సు టీమ్స్)ను నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేసారు. ప్రతి మండలానికి మూడేసి బృందాలను నియమించడం జరిగిందని, ఈ బృందం డిప్యూటీ తఃసిల్దార్లు ఆధ్వర్యంలో పని చేస్తుందని, ఇందులో పోలీస్ కాన్స్టేబుళ్ళ తో పాటు రెవిన్యూ సిబ్బంది, ఒక వీడియో గ్రాఫర్ టీం సభ్యులుగా ఉంటారని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుండి 2 గంటల వరకు ఒక బృందం, మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు రెండో టీం, రాత్రి 10 నుండి ఉదయం 6 గంటల వరకు మూడో బృందం పని చేస్తుందని తెలిపారు. మండల రెవిన్యూ అధికారి వారి కార్యాలయం నుండి ఈ బృందాలు అని చేస్తాయని తెలిపారు.

ఈ నిఘా బృందాలు వెంటనే సంబంధిత రిటర్నింగ్ అధికారికి రిపోర్ట్ చేయాలనీ, వారు పని చేసే అధికారులు వారిని వెంటనే రిలీవ్ చేయాలనీ ఆదేశించారు. ఈ బృందాలు ప్రధానంగా చెక్ పోస్టుల వద్ద పని చేస్తూ అక్రమ నగదు రవాణా, అక్రమ మద్యం, ఆయుధాలు, బహుమతుల రవాణా పై దృష్టి పెట్టాలని, చెక్ పోస్ట్ వద్ద పట్టుబడిన వాటికీ వీడియోగ్రఫీ తప్పక తీయాలని తెలిపారు. వీడియోలను డివిడిలుగా చేసి అకౌంటింగ్ టీంకు ఫైలింగ్ కోసం అందజేయాలని తెలిపారు. ప్రతి రోజు సీజ్ చేసిన నగదు, ఇతర వస్తువులు, ఫిర్యాదులను ఒక అనెక్షర్‌లో ఏ రోజుకారోజు రిపోర్ట్ చేయాలనీ తెలిపారు.

# అంధ విద్యార్థులకు అండగా నిలిచిన ఎన్జీవో ఎం.వినయ్



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** విజయనగరం ఎం.ఆర్. కాలేజ్‌లో డిగ్రీ చదువుతున్న 13 మంది బ్లైండ్ స్టూడెంట్ పరీక్షలు రాయడానికి సహాయం కావాలి అని ఏసుబాబుని సంప్రదించగా తను పద్మనాభంకి చెందిన ఎన్‌జీఓ మొకర వినయ్‌కి విషయం తెలియచేశారు. అతను వెంటనే తన స్నేహితులతో మాట్లాడి ప్రతి స్టూడెంట్‌కి ఒక హెల్పర్ చొప్పున పంపించి వాళ్ళ పరీక్షలు రాయించడం జరిగింది. వాళ్ళ పరీక్షలకు ఎంతగానో సపోర్ట్‌గా నిలిచిన వినయ్ అన్నయ్యకు స్టూడెంట్స్ అందరూ పరీక్ష రాసి వచ్చి కృతజ్ఞతలు తెలియచేశారు. వినయ్ మరియు తన స్నేహితుల అందరి సహకారంతో విద్యార్థులు పరీక్షలు సమర్థవంతంగా రాస్తున్నాం అని తమకు పరీక్షలు రాయడానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదములు తెలియచేస్తున్నాము అని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

# పాండ్రంగి గ్రామ ప్రజలకు ఉపాధి హామీ పనులు ఏర్పాటు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి నియోజకవర్గం పద్మనాభం మండలంలో గల పాండ్రంగి గ్రామ ప్రజలకు ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించండి అని స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. వివరాల్లోకెళ్తే ఉపాధి హామీ పథకం పనులను ప్రజలకు కల్పించండి అని ఈనెల తేది 19.02.2024న పద్మనాభం మండలం, జాతీయ ఉపాధి హామీ పథకం పి.ఒ మరియు ఎంపీడీఓ బి.శైలజకు పాండ్రంగి గ్రామ 1వ వార్డు సభ్యులు, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మహంతి అప్పల రమణ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. తక్షణమే ఉపాధిహామీ పథకం అధికారులు స్పందించి కురపల్లి చెరువు పని ప్రారంభించి ప్రజలకు పని కల్పించి నందుకు పి. ఒ (PO) మరియు ఎ.పి.ఒకు అప్పలరమణ తన చరవాణి ద్వారా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఉపాధి పనులు కల్పించినందుకు ప్రజలు కూడా సంతోషపడ్డారు.

# కృష్ణాపురంలో ఫిబ్రవరి 25న మెగా రక్తదాన శిబిరం



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవం సందర్భంగా 25వ తారీఖు ఆదివారం కృష్ణాపురం గ్రామం, పద్మనాభం మండలం, విశాఖ జిల్లా నందు మిషన్ తలసేమియా కిడ్స్ కోసం ఇండియన్ బ్లడ్ బ్రదర్స్, అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ సంస్థల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ప్రైవేట్ విద్యాసంస్థల్లో సంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం ప్రవేశాల గురించి అవగాహన కార్యక్రమం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ద్వారా నిర్వహించడం జరుగుతుంది. దీనికి సంబంధించిన పోస్టర్లను పద్మనాభం మండలం ఎంపీపీ కె. రాంబాబు సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ చేతుల మీదుగా విడుదల చేశారు కృష్ణాపురం గ్రామ యువత, పీపుల్ పవర్ సభ్యులు, ఇండియన్ బ్లడ్ బ్రదర్స్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భూ అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న అధికారులు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న కొలదీ వైకాపా నాయకుల భూ దందాలకు, అక్రమ నిర్మాణాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఆరోపించారు.

భీమిలి బీచ్ రోడ్డులో ఉన్న చాకిరేవు గెడ్డ ఏరియా, మంగమారి పేట తీర ప్రాంతంలో అక్రమ కట్టడాలు కడుతున్నా జీవిఎంసీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటానికి కారణమేమిటని గంటా నూకరాజు ప్రశ్నించారు. గెడ్డను బడాబాబులు ఆక్రమిస్తున్నారని పత్రికా విలేకరులు జోనల్ అధికారులను అడిగినా అది జిరాయితీ అని వారికే వత్తాసు పలకడం దేనికి సంకేతమని అన్నారు. ఆక్రమించి కట్టిన ప్రాంతంలో వర్క్ ఇన్ ప్రోగ్రెస్ అనే బోర్డులు జీవిఎంసీ అధికారులకు తెలియకుండా పెట్టారంటే అధికారుల సహకారం ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతోందని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడవలసిన అధికారులే అక్రమణదారులకు అండగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు. ఒకపక్క మంగమారి పేటలో కూడా పెద్ద పెద్ద రాళ్ళతో తీరాన్ని ఆక్రమించి కట్టడాలు ప్రారంభించారని అన్నారు. తీరం కోతకు గురవుతున్న కారణంగా తీరంలో ఉండే మత్స్యకారులు వేదన చెందుతున్నారని, పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరికలు జారీ చేస్తున్నారని అయినా స్థానిక అధికారుల్లో చలనం లేదని అన్నారు. వైకాపా నాయకులకు అండగా ఉండటమే వీరి ఉద్యోగ నియమావలా అని గంటా నూకరాజు ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులో మార్పు రావాలని ప్రజల గోడును అర్థం చేసుకొని పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడాలని హితవుపలికారు.

# నేడు ఏపీపీఎస్సి గ్రూప్ - 2 పరీక్ష

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సి) ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఏపిపిఎస్సి పరీక్ష నిర్వహణపై రూట్ ఆఫీసర్స్ (ఆర్వో), లైజన్ ఆఫీసర్స్ (ఎల్‌ఓ), చీఫ్ సూపరింటెండెంట్లకు (సిఎస్) శిక్షణ కార్యక్రమం శుక్రవారం ఉదయం ఉడా చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగింది. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ సమన్వయాధికారిగా వ్యవహరించారు.

ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ నెల 25న గ్రూప్-2 పరీక్ష జరగనుందని, ఇందుకు జిల్లాలో 47,491 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. 105 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10.30గం.ల నుండి మధ్యాహ్నం 01.00గం.వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 29 మంది ఆర్వోలు, 105 మంది ఎల్‌ఓలు, 105 మంది సిఎస్‌లను నియమించినట్లు పేర్కొన్నారు.

పరీక్షల నిర్వహణలో ఆర్‌ఓ, ఎల్‌ఓ, సిఎస్‌లు ప్రధాన భూమిక పోషించాల్సి ఉందన్నారు. ఈ సారి ఏపిపిఎస్సి కొత్తగా కొన్ని మార్పులను తీసుకు వచ్చిందని, వాటికి అనుగుణంగా అధికారులు నడుచుకోవాలని సూచించారు. ప్రతి కేంద్రంలో సిసి కెమెరాలు, ఫర్నిచర్, విద్యుత్, తాగునీరు వంటి ఇతర ఏర్పాట్లను సంబంధిత అధికారులు ముందుగానే పరిశీలించి, ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు.

సీఎస్ లు ఉదయం 8.30 గం.ల్లోగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, 10 ని.లకు ముందు ప్రశ్నపత్రాలను ఇన్విజిలేటర్లకు అందజేయాలని సూచించారు. పరీక్షలు ప్రారంభం నుంచి ముగిసే వరకు అత్యంత పారదర్శకంగా, పగడ్బందీగా నిర్వహించాలన్నారు.

**అభ్యర్థులకు పలు సూచనలు చేసిన జేసీ**

అభ్యర్థులు తమతో పాటు ఎటువంటి బ్యాగులు, పర్సులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, బుక్‌లెట్లను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకు రావద్దన్నారు.

పరీక్షా సమయానికి గంట ముందు కేంద్రంలోకి అనుమతిస్తారని, పరీక్ష సమయానికి 15ని.ల ముందు వరకు మాత్రమే అనుమతించడం జరుగుతుంది.

పరీక్ష సమయం పూర్తయ్యే వరకు పరీక్షా కేంద్రంను అభ్యర్థులు విడిచి వెళ్ళారాదని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఏపిపిఎస్సి డెప్యూటీ సెక్రెటరీ కె.వి.ప్రసాద్, అసిస్టెంట్ సెక్రెటరీ ఎన్.వి.సుబ్బయ్య, సెక్షన్ ఆఫీసర్ సుధాకర్ బాబు, కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షకులు డి. రవి, సిబ్బంది ఎ. సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు.

# వైవి.సుబ్బారెడ్డికి అభినందనల వెల్లువ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి రాజ్యసభ సభ్యుడిగా నియమితులైన తర్వాత వైజాగ్‌కు తొలిసారిగా విచ్చేసిన సందర్భంగా ఆయనను ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్, అభినందించారు. రాజ్యసభ సభ్యులు జిల్లా కౌన్సిల్ అధ్యక్షురాలు సుభద్ర, GCC అధ్యక్షురాలు స్వాతి రాణి, మాజీ మంత్రి కూరలేటి బాలరాజు, MLA, మాజీ ఎమ్మెల్యే పీలా వెంకట లక్ష్మి మహిళా జోనల్ ఇన్‌చార్జి విశాఖపట్నం, తదితరులు ఈ అభినందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జీవీఎంసీ 4వ జోన్‌లో వేలంపాట నిర్వహణ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ 4వ జోన్ పరిధిలో డైక్స్ ట్యాంక్, జగదాంబ, పాత బస్ స్టాండ్ ఫేజ్-2, పద్మనగర్, సూర్యాబాగ్ నందు వాణిజ్య సముదాయాలు, అంబేద్కర్ కళ్యాణ మండపం, ఎస్.వి.పి (పూర్ణ మార్కెట్), రామకృష్ణా రైతు బజార్, రెల్లివీధి (రోడ్ సైడ్) ఫిష్ మార్కెట్లు ఆశీలు కొరకు బహిరంగ వేలంపాట నిర్వహించబడునని జోనల్ కమిషనర్ పి.వి.వి.డి. ప్రసాదరావు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

పైన తెలుపబడిన వాణిజ్య సముదాయాలలో గల దుకాణాలకు, కళ్యాణ మండపం, మూడు మార్కెట్లకు 3 సంవత్సరములు కాలపరిమితికి గుత్తకిచ్చుటకు గాను తేది 01-03-2024న ఉ.గం.11.00లకు జీవీఎంసీ 4వ జోనల్ కార్యాలయం సూర్యాబాగ్ నందు బహిరంగ వేలం నిర్వహించబడుతుందని, కావున ఆసక్తి గల వ్యక్తులు గాని, సంస్థలు గాని వేలంపాటలో నిబంధనలకు లోబడి పాల్గొన వలసిందిగా తెలియ జేయడమైనదని జోనల్ కమిషనర్ తెలిపారు. మరిన్ని వివరాలకు సంబంధిత జోనల్ కార్యాలయం నందు పని వేళలో పర్యవేక్షకులను సంప్రదించగలరని ఆయన తెలిపారు.

# బాబు సూపర్ సిక్స్‌కు జిల్లాలో విస్తృత ప్రచారం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను విస్తృత ప్రచారం చేయడానికి అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం నుండి ప్రతినిధులను ఎంపిక చేసి, వారి ద్వారా ప్రతి నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించటానికి పార్లమెంట్ కార్యాలయంలో శనివారం ఉదయం శిక్షణను ఇచ్చామని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసన మండల సభ్యులు బుద్ద నాగ జగదీశ్వరరావు తెలియజేశారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమం ద్వారా పేద ప్రజలను ఆదుకోవడానికి తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆలోచనతో యువతకు ఉద్యోగాలు లేక వైసిపి హామీలతో దగాపడ్డ నిరుద్యోగులకు అది అవకాశాలు కల్పించడానికి 20 లక్షల ఉద్యోగాలు కల్పనకు ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగ భృతి 3000 రూపాయలు ప్రతి నెల చెల్లిస్తామని, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి 15000 రూపాయలు ఇస్తామని, కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకున్న వారందరికీ ఈ పథకం ద్వారా అమలు చేస్తామని, అనకాపల్లి జిల్లాలో రైతాంగాన్ని దగా చేసిన జగన్ రెడ్డి జిల్లాలో షుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరణ చేస్తామని, ప్రతి సంవత్సరంకేంద్రం ఇచ్చిన 6000 కాకుండా 12,500 చెల్లిస్తామని చెప్పి రైతులను మోసం చేసిన విషయాన్ని గ్రహించి భూమి కలిగిన ప్రతి రైతుకు సంవత్సరానికి 20,000 వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తామని, మహిళలు గ్యాస్ ధరలతో ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు గమనించి ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తామని, 18 సంవత్సరాల నిండిన ప్రతి స్త్రీకి నెలకు 1500 వందలు ఇస్తామని, అలాగే జిల్లాలో పార్టీ ఆర్టీసీ బస్సుల్లో ఎక్కడికి వెళ్ళినా ఉచితంగా ప్రయాణం చేసే విధంగా తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో ఈ ఆరు పథకాలను పూజా తప్పకుండా అమలు చేస్తామని తెలుగుదేశం పార్టీ తరపున హామీ ఇస్తూ ప్రతి ఇంటికి పార్టీ సభ్యులు వెళ్లి ఈ పథకాలకు అర్హులను గుర్తించి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని ప్రతి కుటుంబానికి చంద్రబాబు నాయుడు తరపున ప్రతినిధులు ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరించి హామీ పత్రాన్ని ఇవ్వడం నాగ జగదీష్ తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ నియమించిన ప్రతినిధులకు ఆయా ప్రాంతాల్లో తిరిగినప్పుడు సహకరించవలసిందిగా పార్టీ శ్రేణులకు నాగ జగదీష్ పిలుపునిచ్చారు.

# మాఘమాసం జాతర సందర్భంగా సముద్ర తీర ప్రాంతంలో గట్టి పోలీసు బందోబస్తు





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** సబ్బవరం మండలం, ఎన్.హెచ్ 16 సర్వీస్ రోడ్డు, ఇరువాడ పార్కింగ్ ప్లేస్ వద్ద ఎస్సై ఆర్.ధనుంజయకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో అనుమానాస్పద కారుని తనిఖీ చేయగా 219.34 కేజీల గంజాయి పట్టుబడింది. అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రనికి చెందిన నిందితుడిని అదుపులోకి తీసుకుని గంజాయిని, కారుని, మొబైల్ ఫోన్‌ను మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు సబ్బవరం పోలీసులు.

నాతవరం మండలం, డి.ఎర్రవరం జంక్షన్ వద్ద పోలీసులకు రాబడిన సమాచారం మేరకు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పద వ్యక్తుల బ్యాగు లను తనిఖీ చేయగ 10 కేజీల గంజాయి పట్టుబడింది. అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులు అదుపులోకి తీసుకుని గంజాయిని, రూ.2,500- నగదు, 3 కీ ప్యాడ్ మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ఎం.వి.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 174 కేసులు నమోదు చేసి, ఈ-చలానాగా రూ.25,325 రూపాయలు విధించారు.

జిల్లా పోలీసులు, సెబ్ అధికారులు దాడి చేసి, 24 కేసులు నమోదు చేసి, 20 మంది నిందితులను అదుపులోనికి తీసుకుని, 50 లీటర్ల అక్రమ మద్యం, 75 లీటర్ల నాటు సారా ను స్వాధీనం చేసుకుని, 3,650 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసిన పోలీసులు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు మాఘ పౌర్ణమి జాతర స్నానాల కోసం జిల్లాలోని సముద్ర తీరా ప్రాంతాల్లో శనివారం వేకువజామున లక్షలాది మంది పుణ్యస్నానాలు ఆచరించనుండడంతో పోలీసులు పెద్ద ఎత్తున భద్రతా ఏర్పాట్లు చేశారు. పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ మరియు నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ వెంకట్రామయ్య ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని, పోలింగు కేంద్రాలను సందర్శించి, గ్రామస్తులతో సమావేశమయ్యి ఎన్నికలకు సంబంధించి గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ఎస్పీ మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు.

# అనకాపల్లి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థిగా కొణతాల



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి నియోజకవర్గం తెలుగుదేశం జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ పేరు ఖరారు అయింది. 23 అసెంబ్లీ సీట్లు, మూడు ఎంపీ సీట్లు పొత్తులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జనసేనకు తెలుగు దేశం పార్టీ కేటాయించింది. అందులో భాగంగా శనివారం పవన్ కళ్యాణ్ చంద్రబాబు నాయుడు ఉమ్మడిగా అభ్యర్థులను ప్రకటించారు. జనసేన నుండి ఐదుగురు అభ్యర్థులను ప్రకటించగా అందులో అనకాపల్లి నుండి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పేరును పవన్ కళ్యాణ్ ఖరారు చేసి ఆయన పేరును ప్రకటించారు. దీంతో ఆయన అభిమానుల్లో సంబరాలు నెలకొన్నాయి అనకాపల్లిలో ఆనందంతో బాణాసంచా కాల్చారు. రామకృష్ణ రెండు సార్లు ఎంపీగా గెలుపొందారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఒకసారి ఓటమి చెందినప్పటికీ రెండోసారి విజయం సాధించారు. ఎమ్మెల్యేగా విజయం సాధించి వైయస్ రాజశేఖర్ రెడ్డి క్యాబినెట్లో మంత్రిగా వ్యవహరించారు అనంతరం ఆయన రాజకీయాల్లో చురుకుగా పాల్గొనలేదు. కొంతకాలం ఉత్తరాంధ్ర సుదర్శన స్రవంతి ప్రాజెక్టు కోసం సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజా సంఘాలతో పాల్గొన్నారు. కొంతకాలం మౌనంగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తిరిగి జనసేన పార్టీలో ఇటీవల చేరారు. ఆయనకు మొదటి జాబితా లోనే టికెట్ ఖరారు కావడం విశేషం. తెలుగుదేశం పార్టీ నుండి పీలా గోవింద్, బుద్ధ నాగ జగదీష్, దాడి రత్నాకర్ పోటీ చేసేందుకు ఎవరికి వారు ప్రయత్నాలు చేసినప్పటికీ పొత్తులో భాగంగా అనకాపల్లిని జనసేనకు కేటాయించడంతో ఖంగుతిన్నారు. ఇప్పుడు వీరి నిర్ణయం ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. పొత్తు ధర్మాన్ని పాటించి వీరు పని చేస్తారా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. ఒకటి రెండు రోజుల్లో అనకాపల్లి రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయనేది స్పష్టత వచ్చే అవకాశం కూడా ఉంది. ఏది ఏమైనా కొణతాల రామకృష్ణ పేరును ప్రకటించడం జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో ఆసక్తిని రేకెత్తించింది అనడంలో సందేహం లేదు. అయితే ఇప్పటికే తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మాజీ శాసనసభ్యుడు పీలా గోవింద సత్యనారాయణకు సీటు ఖరారు అని విస్తృత ప్రచారం జరిగింది. అయితే పార్టీ పొత్తులో భాగంగా జనసేనకు అనకాపల్లి అసెంబ్లీ సీటు ప్రకటించడంతో పీలా గోవింద సత్యనారాయణ అభిమానులు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక అధిష్టానం నిర్ణయాన్ని మార్చుకొని పక్షంలో పీలా గోవింద సత్యనారాయణను కూడా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయించి గెలిపించుకుంటామని పార్టీ అధిష్టానం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పార్టీ ఏ విధంగా పరిగణలో తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

# నేడు ఉపమాక వెంకన్నకు పెండ్లిరాట ఉత్సవం




**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** పాయకరావుపేట నియోజకవర్గం, ఉత్తరాంధ్ర జిల్లాల భక్తుల కొంగుబంగారం, అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం, ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తంగా వేంచేసియున్న శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి వారి వార్షిక తిరు కళ్యాణ మహోత్సవములలో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటల 14 నిమిషములకు స్వామి వారి ఆలయంలో పెండ్లిరాట ఉత్సవము నిర్వహించడం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకుడు గొట్టు ముక్కల వరప్రసాద్ ఆచార్యులు తెలియజేశారు. వచ్చేనెల మార్చి 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు నిర్వహించబడే శ్రీ స్వామివారి వార్షిక కళ్యాణోత్సవములకు సంబంధించి మాఘ బహుళ పాడ్యమి, పుబ్బ నక్షత్ర యుక్త మేష లగ్నమందు ముహూర్త మును అనుసరించి ఉదయం 10 గంటల 14 నిమిషములకు స్వామివారి ఆలయంలో పెండ్లిరాట ఉత్సవం నిర్వహించ బడుతుందని ఆయన చెప్పారు.

తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శ్రీ స్వామివారి ఉత్సవాలలో భక్తులందరూ పాల్గొని శ్రీ స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించవలసిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయం సిబ్బంది, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

శనివారం మాఘపౌర్ణమి సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శనం చేసుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

### ఈనెల 26 నుండి ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలు

**పాడేరు, (విశాఖ సమాచారమ్):** రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఈనెల 26వ తేదీ నుండి 'ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలు 2024'ను నిర్వహిస్తున్నట్లు ఎల్. డి. ఎం. ఎన్.రవి తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియ జేసారు. ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలను వచ్చే నెల 1వ తేదీ వరకు కొనసాగుతాయని చెప్పారు. హుకుంపేట, పెదబయలు మండలాలలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు బ్యాంకుల వలన ఉపయోగాలు, అవసరాలు, డిజిటల్ బ్యాంకింగ్ పొదుపు పై అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు.

## కాంగ్రెస్ కు పూర్వ వైభవం తెస్తాం : సుందరపు



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరపు ఈశ్వర రావు అన్నారు. నియోజకవర్గములో అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామ తీర ప్రాంతంలో శనివారం నాడు మాఘ పౌర్ణమి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజా చైతన్య భేరీలో భాగంగా సుమారు 2 నుంచి 2 వేల మందికి పార్టీ అధికారంలోకి వస్తే దేశానికి, రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలపై ముద్రించిన కర పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికే ఉన్న సీనియర్ నాయకులు పార్టీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తారన్నారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. కరపత్రాలు అందుకున్న పెద్దలు, యువత కూడా తమకి కాంగ్రెస్ పార్టీపై అభిమానం ఉందని పార్టీ గెలుపుకు తమ వంతు కృషి చేసి జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరపు ఈశ్వరరావుకి తప్పకుండా తోడుగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

**విశాఖ సమాచారమ్**
**ప్రతులకు, ప్రకటనలకు**
**సెల్: 9393949345,**
**8247526179**

# శివరాత్రి జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు





**పాడేరు, (విశాఖ సమాచారమ్):** ప్రముఖ శైవ క్షేత్రం మత్యగుండం మహాశివ మహోత్సవానికి అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి టి. చక్రవర్తి అన్నారు. మార్చి 7,8,9 తేదీలలో మత్స్యగుండం శివరాత్రి మహోత్సవం జరుగుతందన్నారు. సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి ఆదేశాల మేరకు మత్స్యగుండం ఉత్సవ కమిటీ, ఆలయ కమిటీ, వివిద శాఖల అధికారులతో మహాశివరాత్రి మహోత్సవం నిర్వహణపై శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహశివరాత్రి జాతరకు వచ్చే సందర్శకులకు తాగునీటి సదుపాయాలు కల్పించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు.

ఆలయ ప్రాంగణంలో నిత్యం పారిశుద్ధ్యం పనులు నిర్వహించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. విద్యుత్తు అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు చెప్పారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు.

మూడు రోజులు భక్తులకు రవాణా సౌకర్యం కల్పించాలని 15 బస్సులు నడపాలని ఆర్.టి.సి అధికారులకు సూచించారు.

అగ్ని ప్రమాద నివారణ పరికరాలు ఏర్పాటు చేయాలని ఫైర్ అధికారులకు సూచించారు. చింతల వీధి కూడలి నుండి మఠం గ్రామం వరకు ప్రధాన రహదారి మరమ్మతులు చేయాలని కమిటీ సభ్యులు కోరగా రహదారులు భవనాల శాఖ అధికారులకు సూచించారు. ఆలయ ప్రాంగణంలో రోడ్డుకి మూడు అడుగుల దూరంలో దుకాణాలు ఏర్పాటు చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో పాడేరు ఎంపిడిఓ సాయి నవీన్, హుకుంపేట ఎంపిడిఓ వెంకటరావు, ఆర్.టి.సి. డి. ఎం. శ్రీనివాస రావు, డి. యల్.పి. ఓ పి. ఎస్. కుమార్, ట్రాన్స్కో డిఇ మల్లేశ్వరరావు, సర్పంచ్ శాంత కుమారి, ఆలయ కమిటీ సభ్యులు టి. అప్పారావు, ఎం. సూర్య నారాయణ నాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఎం. గోపాల రావు, ప్రధాన కార్యదర్శి పి. మత్స్య కొండ బాబు, ఉపాధ్యక్షులు వి.ఈశ్వరరావు, కోశాధికారి టి.భీంబాబు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ డిజిపి పూర్ణచంద్రరావుకు అభినందనలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** దేశానికి, తెలుగు రాష్ట్రాలకు విశేష సేవలందించిన విశ్రాంత ఐపీఎస్ అధికారి, డిజిపి జె.పూర్ణచంద్రరావును బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి, విశాఖ దక్షిణ నియోజకవర్గం బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి కదిరి రాము అభినందించారు. విజయవాడలోని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని రాష్ట్ర కో-ఆర్డినేటర్ జె. పూర్ణచంద్ర రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు కదిరి రాము అభినందనలు తెలిపారు. ప్రతిష్టాత్మక బీఎస్పీలో పూర్ణచంద్ర రావు చేరికతో బహుజన వాదం మరింత పటిష్ట మైందని కొనియాడారు. ఆయన సేవలు ఎంతో అవసరమని కదిరి రాము పేర్కొన్నారు. ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతితో కలిసి రాష్ట్ర కో-ఆర్డినేటర్ పూర్ణచంద్రరావు జిల్లాలలోని నియోజకవర్గాల పనితీరుపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కరణం తిరుపతిరావు, బహుజన న్యాయవాదుల ఫోరం కన్వీనర్, విశ్రాంత జడ్జి పెలుమురు గుర్రప్పతో పాటు బహుజన నాయకులు పెదపెంకి శివప్రసాదరావు, బోని కృష్ణ, దివకాల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ బాల గణపతికి దాడి ప్రత్యేక పూజలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలోని శారదా నగర్‌లో వెలసియున్న శ్రీ వినాయక మందిరం 41వ వార్షికోత్సవం సందర్భంగా విశాఖ జిల్లా తెదేపా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ ఆలయాన్ని శనివారం సందర్శించారు. శ్రీ బాల గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ వినాయక మందిరం వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆలయ సంఘ సభ్యులు రత్నాకర్‌ని సాదరంగా ఆహ్వానించి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ బాలగణపతి సేవా సంఘం సభ్యులు కరణం ఆనంద్, కరణం సాంబశివరావు, కరణం మోహన్ రాజు, కరణం అప్పారావు, కరణం సాంబశివరావు, సంతోష్, మోహన్, వినాయక, రాజు, మణి, తదితరులు పాల్గొన్నారు.

# తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా : ప్రియాంక దండి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా 2వ రోజు ఇసుకతోట గ్రామంలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక దండి పర్యటించారు. స్థానిక ప్రజలను కలిసి ఈ ఎన్నికలలో తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఈ రాష్ట్రంలో అధికారంలోకి ఏ పార్టీ వచ్చినా పోరాడి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని, సార్ట్ అప్ కేంద్రం ఏర్పాటు చేసి దేశ, విదేశాల పెట్టుబడి దారులను రప్పించి యువతను యువ పారిశ్రామిక వేతలుగా తీర్చిదిద్దుతానని, ఢిల్లీలో ఆమ్ ఆద్మీ ప్రభుత్వం చేసినట్టు నియోజకవర్గం మొత్తం ప్రజా రక్షణ కోసం సి.సి కెమెరాలు ఏర్పాటు చేస్తానని, గ్రామాల వారిగా పెద్దలతో, ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామ అవసరాలు, ఎలాంటి అభివృద్ధి పనులు కావాలో తెలుసుకొని వాటికి కావాల్సిన నిధుల కొరకు ప్రభుత్వాన్ని కోరడము, శాసనసభలో ప్రైవేట్ బిల్లు పెట్టి నియోజకవర్గ సమస్యల గురించి చర్చించి అమలు చేస్తానని ఆమె అన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇంకా కొన్ని ప్రాంతాలలో డీ పట్టాలతో ఇళ్ళు ఉన్నాయని, రిజిస్ట్రేషన్ కాక, లోన్లు రాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తన దృష్టికి వచ్చిందని అన్నారు. ఆ సమస్య సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని, సింహాచలం దేవస్థానం భూ సమస్యను చట్ట పరంగా ఛాలెంజ్ చేసి పరిస్కారం తీసుకువస్తానని ప్రజలు ఒక సమస్య కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోతున్నా పనులు కావటం లేదని, అందుకోసం ఒక ప్రత్యేక యాప్ రూపొందిస్తాం అన్నారు. దాంట్లో ప్రజలు సమస్యలు అప్లోడ్ చేస్తే శాసనసభ కార్యాలయ సిబ్బంది సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిస్కారం చేసే విధానం తీసుకువస్తామని, ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టు ఎక్కువసార్లు తిరగక్కర్లేదు, లంచాలు ఇవ్వాల్సిన పని లేదని ఆమె అన్నారు. నేటి యువతలో చాలా మంది దేశ సంపదను, ప్రాఖ్యాతిని పెంచగలిగే తెలివితేటలు ఉన్నవారు ఉన్నారని యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసి వారి సహాయంతో ప్రపంచ స్థాయి ట్రేడ్ సెంటర్ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేస్తానని, పట్టు వ్యవసాయాని ప్రోత్సాహిస్తానని, కష్టపడి పని చేయగలిగే ప్రతి మహిళకు చిన్న తరహా ఉపాధి పరిశ్రమలు నెలకొలుపుతానని, వాటిని మార్కెట్ చేసే ఏర్పాట్లు చేస్తానని దేశంలో "మోడల్ నియోజకవర్గం"గా నిలబెట్టాలని తన కల అని ప్రియాంక దండి అన్నారు.

# అనాథకి పెళ్లి చేసిన ఏయూటీడీ



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆ అమ్మాయి పేరు అనిత, వయసు 20 సం॥లు. 9 ఏళ్ళ వయసులోనే తల్లిదండ్రులు చనిపోయారు. పాపా హెూం, స్వధార్ హెూంలలో ఉంటూ ఇంటర్మీడియట్ వరకు కష్టపడి చదువుకుంది. తను మేజర్ అవడంతో స్వధార్ హెూం వారు AUTD GVMC TSR Complex shelterకి అప్పజెప్పారు. అనితకి ఒక మంచి జీవితం అందించడం కోసం గతంలో ఏయూటీడీ షెల్టర్‌లో ఉంటూ ఉపాధి పొందిన ఖాదర్ (24సం.లు) అనే యువకుడు ముందుకు రావడంతో ఇద్దరి అభీష్టం మేరకు భీంనగర్ షెల్టర్‌లో నిరాశ్రయులందరి సమక్షంలో వివాహం జరిపించడమైనది. అనితకి ఏయూటీడీలో ఉద్యోగ అవకాశం కూడా కల్పిస్తూ, రోడ్లపై తనలాంటి మరింత మందికి సేవలందించే భాద్యతను అప్పగించడం జరిగింది.

# అనకాపల్లి పెరుగుబజార్ రోడ్డు పనులను తక్షణమే పున: ప్రారంభించాలి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణము ఆధ్వర్యంలో పెరుగు బజార్ రోడ్డు పనులు ప్రారంభించి పట్టణ ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వే స్టేషన్ రోడ్డును పూర్తి చేయాలని ప్లకార్డులతో సంఘ సభ్యులు ప్రదర్శన నిర్వహించారు. పట్టణ నడిబొడ్డునగల పెరుగు బజార్ జంక్షన్ నుండి రైల్వే స్టేషన్ మార్గము ఎంతో కాలంగా ఇరుకుగా ఉండి పట్టణ ప్రజలు, వాహన దారులు, ముఖ్యంగా భారీ వాహనముల రాకపోకలతో నిత్యం ట్రాఫిక్ సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారన్నారని అసోసియేషన్ ఛైర్మన్ నాగభూషణం అన్నారు. 6 నెలల క్రితం ఆ రహదారి మార్గం వెడల్పు చేసి అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగింది. ఆగిపోయిన రహదారి మార్గం అస్తవ్యస్తంగా దుమ్ము, ధూళితో నిండి ఉండి అడ్డదిడ్డమైన గోతులతో ఉండటం వలన ఇటు ప్రజలు, అటు వాహనదారులు, ముఖ్యంగా రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణీకులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణ అవరోధాలను అధిగమించి రోడ్డు నిర్మాణం త్వరిత గతిన చేపట్టాలని ఆందోళనకారులు జీవీఎంసీనీ కోరారు. ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పట్టణ జి.వి.ఎం.సి. జోనల్ కార్యాలయములో పట్టణ రోడ్డు ఇంజినీరింగ్ విభాగ సూపరింటెండెంట్ (ఏ.ఈ.). రామమోహనరావుకి బల్లా నాగభూషణము వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణమోహన్, సభ్యులు బూడిద జోగారావు, జిల్లా బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు నేలపూడి బాలరాజు, లీగల్ అడ్వైజర్ గిలకల అప్పారావు, విశ్రాంత మున్సిపల్ ఉద్యోగి ఎస్. బ్రహ్మానందం, స్థానిక సంస్థల ప్రతినిధులు గ్రంధి రామ లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతల ఏర్పాటుకై సామాజిక చైతన్యమే కే బి ఫౌండేషన్ లక్ష్యం





చింతపల్లి, (విశాఖ సమాచారమ్): ఇంకుడు గుంతల ఏర్పాటుకై సామాజిక చైతన్యమే కే బి ఫౌండేషన్ లక్ష్యమని ఆ ఫౌండేషన్ ఛైర్మన్ కొక్కుల కన్నబాబు అన్నారు. మండలంలోని లోతుగెడ్డ జంక్షన్‌లో ఆ ఫౌండేషన్ కోఆర్డినేటర్ వంతల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లా పాడేరు నియోజకవర్గం 5 మండలాలలోని సంబంధిత మండల కోఆర్డినేటర్లు, పంచాయితీలకు సంబంధించిన క్లస్టర్ కోఆర్డినేటర్ల ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంకుడు గుంతలు నిర్మాణములో ప్రజలు భాగస్వాములు అవ్వాలన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలు చైతన్యం కలిగి పక్క గ్రామాల ప్రజలకు కూడా స్వచ్ఛందంగా ఇంకుడు గుంతల నిర్మాణము జరుపుకునేందుకు మార్గదర్శకులుగా ఉండాలన్నారు. యజ్ఞంలా చేపడుతున్న ఇంకుడు గుంతల కార్యక్రమానికి ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కే బీ ఫౌండేషన్ చేపడుతున్న ఇంకుడు గుంతల కార్యక్రమం అభినందనీయమని గిరిజన గ్రామాల ప్రజలు కొనియాడుతున్నారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్లు, పంచాయితీ క్లస్టర్ కోఆర్డినేటర్లు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# సముద్ర తీరంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు



పరవాడ, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మ పాలెం సముద్ర తీరంలో మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం వేలాదిమంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, తీరంలో వెలసిన మాధవ స్వామిని దర్శనం చేసుకున్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ధన సహాయముతో 500 మంది భక్తులకు తీరంలో అల్పాహార విందును అందజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి గజ ఈతగాళ్ళను సిద్ధం చేశారు.

# రెడ్ క్రాస్ వార్షిక సర్వ సభ్యత్వ సమావేశం



విజయనగరం: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, విజయనగరం వారు నూతన మార్గదర్శకాలు ప్రకారం వార్షిక సభ్య సమావేశాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, ఐ ఏ.ఎస్., వారి ఆదేశాల ప్రకారం జాయింట్ కలెక్టర్/ వైస్ ప్రెసిడెంట్ కె. కార్తీక్, ఐ.ఏ.ఎస్ వారి అధ్యక్షతన కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించడం జరిగింది.

ఎజెండా కార్యక్రమాలు అనగా గత సంవత్సరంలో జరిగిన నిర్ణయాలు సమీక్ష, అదేవిధంగా ఈ వార్షిక ప్రణాళికలో రెడ్‌క్రాస్ వారు సాధించిన ప్రగతి ముఖ్యంగా పవర్ గ్రిడ్ వారి సహకారంతో నూతన భవనం అధునిక పరికరాలు సేకరణ, అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారి సహకారంతో చీపురుపల్లి పట్టణంలో నూతన భవనము నిర్మాణం మొదలగు అంశములు మరియు రాబోయే వార్షిక ప్రణాళికలో బడ్జెట్ అంచనా, ఆడిట్ రిపోర్టులు ఇతర అంశములు చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో జీవితకాల సభ్యులు చర్చిలో పాల్గొంటూ పలు అంశాలపై చర్చించడం జరిగింది. అదే విధంగా తదుపరి వార్షిక సమా వేశానికి సభ్యులందరికీ సమాచారం మొబైల్ ఎస్.ఎం.ఎస్ మరియు పత్రికలు ద్వారా కాకుండా సమాచారాన్ని లిఖిత పూర్వకంగా సభ్యులకు తెలియ పరిస్తే బాగుంటుందని కోరినారు మరియు సంస్థ చేపట్టే కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు.

ఇప్పటి వరకు సంస్థ చేపట్టిన కార్యక్రమాలపై సభ్యులు సంతృప్త వ్యక్తపరుస్తూ భవిష్యత్తులో ఇంకా మరెన్నో ప్రజా ఉపయోగ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డి.సహదిత్ వెంకట త్రివినాగ్, ఐఏఎస్, ఆర్.ఎస్.కుమార్, జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఎక్స్ అఫీషియో సభ్యులు కె ఆర్ డి ప్రసాద్ రావు, ఛైర్మన్ ఆర్.రాజగోపాల్ నాయుడు, వైస్ ఛైర్మన్ కె. సత్యం, కార్యదర్శి, టీ. రామారావు, కోశాధికారి, మరియు రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, పేట్రన్స్, వైస్ పెట్రాన్స్, జీవితకాల సభ్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్మానుష్య ప్రాంతంలో వ్యాపారం చేసుకోండి

## చిరువ్యాపారులపై చిందు లేసిన జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ 22వ వార్డులోని చిరు వ్యాపారులపై చిందులేశారు. వార్డులోని తమ సమస్యలను పరిష్కరిస్తాడని భావించామని, ఇలా తల నొప్పిగా మారతారని అనుకోలేదని చిరు వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ పిఠాపురం కాలనీలోని కళాభారతి రోడ్డులో సంత నిర్వహించడానికి వీల్లేదని చిరు వర్తకులపై వీరంగం ఆడిన విషయం తెలిసిందే. గత 20 ఏళ్లుగా వ్యాపారాలు చేస్తున్న తమపై దౌర్జన్యం చేసి వ్యాపారాలు మూసేయాలని మూర్తి యాదవ్ అంటున్నారని పేర్కొంటూ, నిరసనగా దాదాపు వంద మంది ధర్నాకు దిగిన విషయం స్థానికంగా కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. నిత్యం వైసీపీ నాయకుల దౌర్జన్యాలు అంటూ మీడియా సమావేశాలతో ఊదరగొట్టే పీతల మూర్తి యాదవ్ సామాన్య చిరు వ్యాపారులపై విరుచుకు పడ్డాన్ని సిఐటియు నేతలు ఖండించిన సంగతి విదితమే. ఇదిలా ఉండగా తోపుడు బండ్ల వ్యాపారులను, చిరు వ్యాపారులను శనివారం మూర్తి యాదవ్ పిలిచి పిఠాపురం కాలనీ రోడ్డులో వ్యాపారాలు చేస్తే సహించేది లేదని కేకలు వేయడం అక్కడ వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. పైగా మాజీ ఎమ్మెల్సీ మాధవ్ కార్యాలయం రోడ్డు నిర్మానుష్యంగా ఖాళీగా ఉంటుందని అక్కడ వ్యాపారం చేసుకోండి అని మూర్తి యాదవ్ సూచించడం విశేషం. జనసాంద్రత లేని ప్రదేశంలో తాము వ్యాపారం చేసుకునేది ఎట్లా అని వారంతా వాపోతూ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, వైసీపీ నాయకులు వంశీకృష్ణ ముందు తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు. రెండు నెలల్లో టిడిపి జనసేన అధికారంలోకి వస్తుందని సమస్య పరిష్కరిస్తానని వంశీకృష్ణ వారికి హామీ ఇవ్వడం విశేషం. సాధారణంగా అధికార పార్టీ నేతల తాలూకా వారు ఈ విధంగా వ్యవహరిస్తూ ఉంటారని, ప్రతిపక్ష నేత పార్టీకి చెందిన వారై ఉండి మూర్తి ఇలా వ్యవహరించడంపై సొంత పార్టీ వారే మండిపడుతున్నారు.


Sugar Free Fitearly | నడివయస్కులకు దివ్య శక్తి ఫిట్ ఎర్లీ | थकावट से सत्वर उपसमन फिट एर्ली

వివిధ వృత్తి, ఉద్యోగాలలో అలసటకు లోనై నీరసించి పోతున్నారా?

మందులు మింగలేక, చక్కెరతో కూడిన ఎనర్జీ బూస్టర్లు సేవించలేకపోతున్నారా?

దిగులు చెందకండి.

"ఫిట్ ఎర్లీ" మిమ్మల్ని నిరంతరం శక్తివంతం గాను, ఉత్సాహవంతంగాను ఉంచుతుంది.

సోయప్రోటీన్, వే ప్రోటీన్, బ్రాహ్మి, హరితకి, సీ భక్తారన్, శొంఠి, తులసి, అశ్వగంధ

తదితర హిమాలయముల నుండి సేకరించిన విశిష్ఠ వన మూలిక సమ్మిళితమైన "ఫిట్ ఎర్లీ" విశిష్టానుభవం గల పరిశోధకులచే రూపొందించబడింది. అంతేకాక ప్రఖ్యాత వైద్యరంగ పరిశోధన శాలలో అన్ని విధములుగా పరీక్షించబడి సంతృప్తి కరమైన ఫలితాలను ప్రకటించుకోబడిన ఉపాహారం



ఆంధ్రప్రదేశ్‌లో డీలర్‌షిప్ వివరాలకు సంప్రదించండి

ఎస్.వీరభద్రరావు : సెల్: 8247526179

ఈ-మెయిల్: surampudi43@gmail.com

HERBINDO LABS PRIVATE LIMITED ® HEALTH AND HAPPINESS

Compli

HERBINDO LABS PVT LTD.
2-2-642/1/1/1A, Sadguru Krupa,
Street No 16,
Amberpet, Hyderabad - 500013,
Telangana, India
E-Mail: herbindolabs@gmail.com
Mob: +91 9704885252
GSTN: 36AAECH6684G1ZA
CIN: U24100TG2018PTC127052

# 25న యాదవ భవన్‌కి భూమి పూజ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం డాబాగార్డెన్స్ వి జే ఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మాట్లాడుతూ, యాదవ సంఘం కమ్యూనిటీ హాలు భవనానికి ప్రభుత్వం గతంలో ఎండాడ దిశ పోలీసు స్టేషన్ వద్ద 50 సెంట్ల భూమి కేటాయించింది అని గుర్తు చేశారు. భూమి కేటాయించిన ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి ఆమె సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వై.వీ. సుబ్బారెడ్డి ఆదివారం భూమి పూజ చేస్తారు అని వెల్లడించారు. యాదవ సామాజిక వర్గానికి కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టడం హర్షణీయం అన్నారు. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. తాను మేయర్ అయిన వెంటనే యాదవ భవన్ కోసం సిఎంకి వినతి పత్రం ఇచ్చాను అని గుర్తు చేశారు. కౌన్సిల్ ఆమోదం తీసుకుని భవన నిర్మాణం చేపడతారు అని తెలిపారు.

గొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు సామాజిక వర్గానికి భవనాలు ఇవ్వలేదు అని మండిపడ్డారు. యాదవ భవన్‌కి రూ.25 కోట్ల విలువైన భూమి ఇవ్వడం హర్షణీయం అన్నారు. పక్కనే కాపు భవన్ కోసం కూడా భూమి కేటాయింపు చేశారు అని తెలిపారు. భూమి పూజలో పౌర సరఫరాల శాఖ మంత్రి కనుమూరి నాగేశ్వర రావు, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొంటారు అన్నారు.

విశాఖపట్నం జిల్లా యాదవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మొల్లి అప్పారావు మాట్లాడుతూ విశాఖలో గల యాదవులకు భవనం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న నేపథ్యంలో మేయర్ సహకారంతో ప్రభుత్వం భూమి కేటాయించింది. జీ ఓ - 450 ద్వారా భూమి ఇచ్చిన సిఎంకి ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వానికి యాదవుల మద్దతు వుంటుంది అన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి గుడివాడ అమర్నాథ్ తదితర ప్రముఖులు పాల్గొంటారు అని పేర్కొన్నారు.

సంఘం యువజన అధ్యక్షుడు పల్లా దుర్గారావు మాట్లాడుతూ, యాదవ భవన్‌కి భూమి కేటాయింపు చేసిన సిఎం జగన్ మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

మీడియా సమావేశంలో యాదవ సంఘం నాయకులు సారిపిల్లి గోవింద్, మువ్వల లక్ష్మి సురేష్, పీతల గోవింద్, గుంటు బోయిన రవి కుమార్, మన్యాల శ్రీనివాస్, పీతల వాసు, పాల్గొన్నారు.

# బీజేపీ ప్రజా పోరు యాత్రలో కేంద్ర ప్రభుత్వ పథకాలుపై బీజేపీ నేతల ప్రచారం



**పాడేరు/అరకువేలీ, (విశాఖ సమాచారమ్):** కేంద్ర ప్రభుత్వ పథకాలపై లోతేరు వారపు సంతలో బీజేపీ నేతలు ప్రచారం చేశారు, శనివారం అరకువేలి అసెంబ్లీ గన్నెల, మాదాల, పంచాయతీల్లో, లోతేరు వారపు సంతలో బీజేపీ అరకువేలి బీజేపీ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో బీజేపీ గిరిజన మోర్చా కన్వీనర్ కురుసా పార్వతమ్మ ప్రచారం నిర్వహించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అత్యధిక నిధులు కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది అని తెలిపారు. పేద ప్రజలకు గరీబ్ కళ్యాణ్ యోజన పథకం ద్వారా ఉచితంగా బియ్యాన్ని ఇస్తుంది నరేంద్రమోడీ ప్రభుత్వం, ప్రధానమంత్రి అవాస్ యోజన ద్వారా గిరిజనుడి ఇంటికి 2లక్షల20వేలు, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటిఇంటికీ కుళాయిలు మంచి నీరు సరఫరా, ఉచితంగా విద్యుత్ సరఫరా 200 యూనిట్లు, రాష్ట్రంలో వైసీపీ ఇసుక మాఫియా, మద్యం మాఫియా, భూ దోపిడీ, కేంద్రం ఇస్తున్న గ్రామ పంచాయతీ నిధులు మళ్లింపు, గిరిజన దళిత ప్రజలు పై దాడులు, ప్రభుత్వ ఉద్యోగులు పై కేసులు ప్రతిపక్ష పార్టీలు పై ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేస్తున్న వైకాపా ప్రభుత్వంపై రాబోయే ఎన్నికల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు లోతేరు వారపు సంతలో రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన పై బీజేపీ ప్రజాపోరు యాత్రలో బీజేపీ నేతలు దుయ్యబట్టారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొంబినాయుడు, బీజేపీ అరకువేలి మండల అధ్యక్షుడు స్వాభి రామచందర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బలరాం, తదితరులు హాజరయ్యారు.

# రెండు వేల మంది నేరస్తుల విడుదల చేసిన 'దొంగ' జడ్జి



అతని పేరు ధనిరామ్ మిట్టల్. పోలీస్ రికార్డుల్లో మాత్రం సూపర్ నట్వర్‌లాల్, ఇండియన్ చార్లెస్ శోభరాజ్ అని పేర్కొంటారు. భారతదేశంలోని అత్యంత తెలివైన నేరస్థుడిగా పేరు గాంచాడు. మిట్టల్ చదువు సంధ్యలు అబ్బక అల్లరిచిల్లరిగా తిరిగి దొంగతనాలకు అలవాటు పడ్డాడనుకుంటే పొరపాటు. ఇతను లా డిగ్రీ చదివాడు. అంతేకాదు హ్యాండ్ రైటింగ్‌లో స్పెషలిస్ట్. గ్రాఫాలజిస్ట్. ఇలా ఎన్నో విద్యార్హతలున్న ధనిరామ్ మిట్టల్ దొంగతనాన్ని జీవనోపాధిగా ఎంచుకోవడం గమనార్హం. సుమారు ఆరు దశాబ్దాల కాలంలో రికార్డు స్థాయిలో అరెస్టు అవ్వటమే కాదు, వెయ్యికి పైగా కార్లను దొంగతనం చేసిన రికార్డు కూడా సృష్టించాడు. ప్రధానంగా ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పట్టపగలు కార్లను దొంగలించడం ఇతని స్పెషాలిటీ.

ఇతని మరో స్పెషాలిటీ గురించి తెలిస్తే ఆశ్చర్యపోతారు. తప్పుడు పత్రాలను సృష్టించి అదనపు సెషన్స్ జడ్జి స్థానంలో జడ్జి అవతారమెత్తి 2 వేల మంది నేరస్తులను విడిపించాడు. ఏం జరుగుతోందో పోలీసులకు అర్థమయ్యేలోగా అక్కడి నుంచి మిట్టల్ మాయమయ్యాడు. విషయం తెలుసుకున్నాక అతను విడిపించిన నేరస్తులందరినీ మళ్లీ కటకటాల వెనక్కి నెట్టారు. స్వయంగా న్యాయశాస్త్రంలో పట్టభద్రుడైన ధనిరామ్ మిట్టల్ తన నేరపూరిత చర్యలకు ముందు 1968 నుంచి 1974 వరకు నకిలీ పత్రాలను ఉపయోగించి స్టేషన్ మాస్టర్‌గా కూడా పనిచేశాడు. తాజాగా మంగళవారం ఢిల్లీలోని పశ్చిమ విహార్‌లో అరెస్ట్ తర్వాత మిట్టల్ మరోసారి వార్తల్లోకెక్కాడు. షాలీమార్ బాగ్‌లో దొంగతనం చేసిన మారుతీ ఎస్టీమ్ కారును స్క్రాప్ డీలర్‌కు విక్రయిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. మే 4న జైలు నుంచి విడుదలైన తర్వాత అతను చేసిన రెండో కారు దొంగతనం ఇది. ఇంతకంటే ముందు మార్చి నెలలో మిట్టల్‌ను ఒకసారి అరెస్ట్ చేశారు.

# జీవీఎంసీ స్థలాలను పరిరక్షించండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మహా విశాఖ నగర పాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాలను గుర్తించి పరిరక్షించాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన 2వ జోన్ ముడసర్లోవ నర్సరీ తోపాటు ముడసర్లోవ పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు.

ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ ముందుగా ముడసర్లోవ నర్సరీని పరిశీలించి స్థల విస్తీర్ణం, అక్కడ ఉన్న మొక్కల వివరాలను డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎం.దామోదరరావును అడిగి తెలుసుకున్నారు. ముడసర్లోవలో ఆకర్షణీయమైన చిల్డ్రన్ పార్కు ఏర్పాటు కొరకు ఇక్కడ ఉన్న నర్సరీని తరలించేందుకు ముడసర్లోవ పరిసర ప్రాంతలలో స్థల పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. ముడసర్లోవ పరిసర ప్రాంతాలలో నిరుపయోగంగా ఉన్న జీవీఎంసీ ఖాళీ స్థలాలను గుర్తించి వాటిని సర్వే జరిపి నివేదిక అందించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు.

అనంతరం 13వ వార్డు నందు ఆరిలోవ ఎం.ఎస్.ఎఫ్ నుండి ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ వరకు ఉన్న డబల్ రోడ్డు నందు వ్యర్థాలు చెత్తతో నిండి ఉండడాన్ని గమనించి డబల్ రోడ్డు, పరిసర ప్రాంతాలు నిత్యం పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ జి.శైలజ వల్లి, ఏ.ఎం.ఓ.హెచ్ కిషోర్‌ను ఆదేశించారు.

ఈ పర్యటనలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎం.దామోదరరావు, పర్యవేక్షక ఇంజినీర్ శాంసన్ రాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ శాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఉద్యోగ నియామక పత్రాలను అందించిన జీవీఎంసీ అదనపు కమిషనర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** వివిధ ప్రతిభావంతులకు విశాఖ జిల్లా కలెక్టర్ డా॥ ఎ.మల్లిఖార్జున ఉత్తర్వుల మేరకు జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదేశాలతో ఐదు మందికి పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా నియామక ఉత్తర్వులను అందించామని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చాంబర్‌లో ఐదుగురికి పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందించడం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులైన ఐదు మందికి జివిఎంసి నందు పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా ఉద్యోగ నియామక ఉత్తర్వులను టి.లక్ష్మమ్మ, వై.నిర్మల, వి.గంగు నాయుడు, ఎల్.శివ నారాయణ, ఎం.రాజేష్‌లకు అందించడం జరిగిందని తెలిపారు. ఉద్యోగం పొందిన వారు వారికి కేటాయించిన విధుల్లో చేరి ఎటువంటి రిమార్కు లేకుండా చిత్తశుద్ధితో తమ ఉద్యోగ విధులను నిర్వర్తించాలని తెలిపారు.

ఆహ్వానము
CITIZENS for DEMOCRACY
సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో
ఓటు వేద్దాం
ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం
రాష్ట్రస్థాయి కళాజాత
ప్రారంభోత్సవ కార్యక్రమం
ది. 25-02-2024 ఆదివారం, ఉ॥ 10 : 00 గం॥లకు
కె.ఆర్.సి. ఆడిటోరియం, గీతం యూనివర్శిటి, ఋషికొండ, విశాఖపట్నం
వక్తలు
శ్రీయుతులు యల్.వి. సుబ్రహ్మణ్యం
ఉపాధ్యక్షులు, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ. పూర్వ ఛీప్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
శ్రీయుతులు డా॥ నిమ్మగడ్డ రమేష్ కుమార్
పూర్వ రాష్ట్ర ఎన్నికల అధికారి, ప్రధానకార్యదర్శి, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ
శ్రీమతి ప్రొ॥ కె.నిరుపరాణి
పూర్వ వైస్ ఛాన్సలర్, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం
ప్రొ॥ పి.హరిప్రకాష్
పూర్వ డైరెక్టర్, దూర విద్యా కేంద్రం, ఆంధ్ర యూనివర్శిటి
డా॥ తరీఫ్ సోహాయిల్, రాజనీతిశాస్త్ర ఆచార్యులు, గీతం యూనివర్శిటి
శ్రీ వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, సంయుక్త కార్యదర్శి, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ
12 మందితో కూడిన రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాష్ట్ర స్థాయి కళాకారులతో ఓటు విలువను తెలుపుతూ గేయాలు, నృత్య నాటికలు, జాన పదాలు, గజల్స్ ఆలపిస్తారు.
అందరూ ఆహ్వానితులే
వివరాలకు
9949930670

విశాఖ ఆరువేల నియోగి బ్రాహ్మణ సంక్షేమ సంఘము
ఆధ్వర్యంలో
రి.నెం. 72/2016
బ్రాహ్మణ వధూ వరుల వివాహ పరిచయ వేదిక
తేది. 25-02-2024 ఉ॥ గం॥ 9.30 ని॥ ల నుండి
శ్రీ ఆశీర్వాద రైల్వే ఫంక్షన్ హాల్, ధర్మానగర్, కంచరపాలెం, విశాఖపట్నం
For Off line Registration plz Contact :
Smt. Aduri Kalyani @ 0891 - 2534289
Sri Aduri Nageswar Rao @ 7569084081
Sri S.S. Pratap @ 9912833506
Smt. Ramya Sagar @ 7899533399
Sri S.V.R. Murthy @ 9397678826
Sri B.V. Prasad @ 9848127681
Smt. Pogaru Lakshmi @ 9885710983
[illegible]
For On line Registration plz Contact :
Sri P. Satyanarayana @ 8885953378
Sri A. Radha Krishna @ 9490132636
Last Date for Registration : 18-02-2024

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Parawada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676